తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం
19 జూన్ 2026
పేజీలు : 8



# రికార్డు సృష్టించిన షాడో బాస్ ఒకే కుర్చీలో 9 ఏళ్ల 8 నెలల 7 రోజులు!

○మండలం పుట్టినప్పటి నుంచి కదరని సీటు ఉపాధి హామీలో అజేయ సుల్తాన్!

○సాధారణ ఉద్యోగులకు మూడేళ్లకే బదిలీ పోటు ఈ అధికారికి మాత్రం చట్టాలు చుట్టపుచూపా?

○రెండు మండలాల పవర్‌తో ఇష్టారాజ్యం ఈ మహా బలగం వెనుక ఉన్న పెద్దలెవరు?

**మాడుగులపల్లి, జూన్ 18( జనం సాక్షి ):** సాధారణంగా ఏ ప్రభుత్వ శాఖలోనైనా ఒక అధికారి లేదా ఉద్యోగి ఒకే స్థానంలో గరిష్టంగా మూడేళ్లు, మహా అయితే నాలుగేళ్లు పనిచేస్తారు ఆ తర్వాత బదిలీ కావడం లేదా లూప్ లైన్‌కు వెళ్లడం ప్రభుత్వ నిబంధన కానీ, మాడుగులపల్లి ఉపాధి హామీ విభాగంలో సాగుతున్న అరాచక పాలనకు ఏ చట్టాలూ వర్తించవు 2016 అక్టోబర్ 11న మాడుగులపల్లి మండలం ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు, అంటే కచ్చితంగా 9 సంవత్సరాల 8 నెలల 7 రోజుల పాటు సదరు అధికారి ఒకే కుర్చీలో, ఒకే సీటులో తిష్ట వేసి సరికొత్త రికార్డు సృష్టించారు ఎంతోమంది ప్రజాప్రతినిధులు మారారు, ఉన్నతాధికారులు మారారు, కానీ ఈ షాడో బాస్ సీటు మాత్రం ఇంచి కూడా కదల్లేదు ఈ సుదీర్ఘ కాలపరిమితి వెనుక దాగి ఉన్న అసలు బలం ఏంటి? ఈయనను కదల్చలేకపోతున్న బలగం ఎవరిది? అని మండల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు

**రెండు మండలాల పవర్‌తో పెత్తనం!**

మాడుగులపల్లిలో సొంత పోస్టింగ్‌ను దశాబ్ద కాలంగా అంటిపెట్టుకుని ఉండటమే కాకుండా, తనకున్న అపారమైన రాజకీయ, అధికారుల సపోర్టు, తో పక్కనే ఉన్న వేములపల్లి మండలానికి కూడా ఇన్‌ఛార్జ్‌గా అదనపు బాధ్యతలు దక్కించుకున్నారు రెండు మండలాల ఉపాధి హామీ నిధులు, రికార్డులు ఈయన గుప్పిట్లోనే ఉండటంతో స్థానికంగా ఎవరినీ లెక్కచేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి కనీసం కార్యాలయానికి ఒక బోర్డు కూడా లేకుండా, ప్రజలకు అడ్రస్ తెలియకుండా ఆఫీస్ నడపడం, బడి పిల్లలకు ఇబ్బంది కలుగుతున్నా పత్రికా కథనాలను బేఖాతరు చేయడం ఈయన అహంకారానికి పరాకాష్ట అని స్థానికులు



మండిపడుతున్నారు

**ఈ అనంత కాలపరిమితి వెనుక ఉన్న అసలు కథ ఏంటి..?**

ఏ అధికారి అయినా కొన్ని రోజుల తర్వాత బదిలీపై వెళ్లాల్సిందే కానీ ఈ అధికారి మాత్రం 9 సంవత్సరాల 8 నెలల 7 రోజులుగా మాడుగులపల్లిని వదిలి పెట్టకపోవడం వెనుక ఏ పెద్దల హస్తం ఉంది? ఏ ఉన్నతాధికారుల ఆశీస్సులు ఈయనకు రక్షణ కవచంగా మారాయి? కోట్ల రూపాయల ఉపాధి హామీ నిధుల మతలబులే ఈ సీటును కదలకుండా చేస్తున్నాయా? అనే సందేహాలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి ఈ పదేళ్ల సుదీర్ఘ తిష్టపై, అక్రమ వ్యవహారాలపై నల్గొండ జిల్లా కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డి ఆర్ డి ఓ) ఉన్నతాధికారులు తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరపాలి ఒకే చోట పాతుకుపోయి వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న సదరు అధికారిని తక్షణమే బదిలీ చేసి, మాడుగులపల్లి, వేములపల్లి మండలాలకు పూర్తిస్థాయి స్వతంత్ర అధికారులను నియమించాలని ఉపాధి కూలీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం..

**కలెక్టర్ బి చంద్రశేఖర్ కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చైర్మన్, ఈవో**



**కనగల్లు, జూన్ 18(జనంసాక్షి)** ఈనెల 23, 24, 25 తేదీలలో మూడు రోజులపాటు ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ ఎల్లమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ బ్రహ్మోత్సవాలకు జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, జాయింట్ కలెక్టర్ జె శ్రీనివాస్, డిఆర్ఓ దశరథ్ నాయక్, లు హాజరు కావాలని కోరుతూ ఆలయ చైర్మన్ చీదేటి వెంకటరెడ్డి, కార్యనిర్వాహన అధికారి అంబటి నాగిరెడ్డిలు స్వయంగా వారిని కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. వారి వెంట ఆలయ ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి, అర్చకులు గాదె దామోదర్ రావు సిబ్బంది శ్రీకర్ తదితరులున్నారు.

## రైతన్న శెలక దున్నకపాయే.. పత్తి గింజలు పెట్టకపాయే..!

**వానలు లేక దిక్కుతోచని స్థితిలో పత్తి రైతులు కరుణ కోసం ఎదురుచూపులు**



**పి.ఏ.పల్లి, జూన్ 18 (జనంసాక్షి):** దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. రైతు లేనిదే రాజ్యం లేదనే మాటను గుర్తు చేస్తూ, పి.ఏ.పల్లి మండల రైతులు వరుణదేవుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.పత్తి, కంది పంటల సాగు కోసం పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు వర్షా భావంతో ముందడుగు వేయలేకపోతున్నారు. కొందరు రైతులు భూమి సాలు వచ్చిన వెంటనే శెలక దున్ని విత్తనాలు వేయాలని భావించినా, వర్షాలు కురవకపోవడంతో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇప్పటికే అప్పులు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు పెట్టినప్పటికీ వానలు లేకపోవడంతో పంటల సాగు ఆలస్యం అవుతుండటంతో అప్పుల భారం పెరిగే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా వరుణదేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఆదుకోవాలని రైతులు ప్రార్థిస్తున్నారు. మండలవ్యాప్తంగా రైతాంగం వర్షాల కోసం ఆశగా ఎదురుచూస్తోంది.

## ప్రాణాలతో చెలగాటం




- సిమెంట్ పరిశ్రమలో భారీగా విధ్య రసాయనాల వినియోగం
- రెండు రోజులు పరిశ్రమలోకి అనుమతించకపోవడంతో పెద్ద ఎత్తున నిలిచిన ప్రాణాంతక రసాయన వాహనాలు
- సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు లో వ్యర్థరసాయన లారీల కలకలం
- ప్రజలు కంటపడకుండా కంపచెట్ల వెనుక దాచిపెట్టిన మైహోమ్ సిమెంట్స్ యాజమాన్యం

**మేళ్లచెరువు (జనంసాక్షి)** సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలోని వేపలమాదారం రోడ్డులో ప్రాణాంతక రసాయన వాహనాలు కలకలం సృష్టిస్తున్నాయి. గత మూడు రోజులుగా పదుల సంఖ్యలో వ్యర్థ రసాయన వాహనాలు రహస్యంగా దాచి పెట్టడం పట్ల పలు ఆరోపణ వినిపిస్తున్నాయి.ఈ వ్యర్థ రసాయన వాహనాల నుండి వెలువడే గాడమైన వాసనతో ఊపిరాడక ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మేళ్లచెరువు సర్వేనెంబర్ 874లో గల ప్రభుత్వ భూమిలో గత మూడు రోజులుగా ప్రాణాంతక వ్యర్థ రసాయనాల లారీలు దాచిపెట్టడం సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల గల ఫార్మా కంపెనీల నుండి రాత్రి సమయంలో వచ్చిన 30కి పైగా లారీలు ఇక్కడ నిలిచి ఉన్నాయి. ఈ లారీలు మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమకు వెళ్లాల్సి ఉండగా మిగతా 2లో

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్ష



**ఖమ్మం కార్పొరేషన్, జూన్- 18 (జనంసాక్షి)** జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్‌డఆర్, ఇర్రిగేషన్ భూసేకరణ కమిషనర్ కె. శివకుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిపై ప్రాజెక్టుల వారిగా సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో ఉన్న పెండింగ్ అంశాలను వేగవంతంగా పరిష్కరించి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమీక్ష సందర్భంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, మున్నేరు?పాలేరు లింక్ కాలువతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న ఇతర సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని పరిశీలించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, పరిహారం చెల్లింపులు, పెండింగ్ కోర్టు కేసులు మరియు సర్వే పనుల స్థితిగతులపై అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ తెలిపారు. పెండింగ్ అంశాల పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ మిగతా 2లో

# అన్నం సేవా ఫౌండేషన్ ఆశ్రయితులకు ఆధార్ నమోదు - గుర్తింపు

**ఖమ్మం కార్పొరేషన్,జూన్ 18( జనంసాక్షి)** నిరాశ్రయులు, అనాథలు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తున్న అన్నం సేవా ఫౌండేషన్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం ఆశ్రయితుల జీవితాల్లో కొత్త ఆశలను నింపింది. గుర్తింపు, సంక్షేమ సేవల ప్రాప్తి, అలాగే కొందరికి కుటుంబాలతో పునరేకీకరణకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి ఆదేశాలు, జిల్లా న్యాయ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు (ఇన్‌చార్జ్), జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జి.వి. మహేష్ నాథ్ మార్గదర్శకత్వంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మానస అన్నం సేవా ఫౌండేషన్‌ను సందర్శించి ఆశ్రయితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు.ఆశ్రయితులలో చాలామందికి గుర్తింపు పత్రాలు లేకపోవడం వల్ల సంక్షేమ సేవలు, ఇతర ప్రయోజనాలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన జిల్లా న్యాయ సేవా సంస్థ, జిల్లా యంత్రాంగం సంబంధిత అధికారులతో సమన్వయం చేసి ఆశ్రమంలోనే ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది.జిల్లా కలెక్టరేట్ మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక శిబిరం నిర్వహణకు సహకరించారు. శిబిరంలో ఆశ్రయితుల బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసి ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టారు.ఇప్పటికే గతంలో ఆధార్ పొందిన వారి వివరాలు గుర్తించబడితే వాటిని తిరిగి పొందేందుకు చర్యలు తీసుకోనున్నారు. అటువంటి వివరాలు లభించిన పక్షంలో వారి అసలు గుర్తింపును నిర్ధారించి కుటుంబ సభ్యులను గుర్తించే అవకాశం ఉంటుంది. కుటుంబ వివరాలు లభించిన వారికి పునరేకీకరణ దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వివరాలు లభించని వారికి కొత్త ఆధార్ కార్డులు జారీ చేయనున్నారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మానస మాట్లాడుతూ, "గుర్తింపు పత్రం అనేది కేవలం ఒక కార్డు మాత్రమే కాదు. సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న వ్యక్తులకు అది గౌరవప్రదమైన జీవనం, సంక్షేమ సేవలు మరియు న్యాయ పరిరక్షణకు ద్వారంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.ఆధార్ నమోదు పూర్తయిన అనంతరం జాతీయ న్యాయ సేవా సంస్థ అమలు చేస్తున్న నిరాశ్రయులు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు, సామాజికంగా



విస్మరించబడిన వర్గాలు మరియు పేదరికంలో జీవిస్తున్న వారికి సంబంధించిన వివిధ న్యాయ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశ్రయితులకు అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కులో గౌరవప్రదంగా జీవించే హక్కు కూడా అంతర్భాగమేనని, సమాజంలోని అత్యంత బలహీన వర్గాలకు గుర్తింపు, న్యాయ సహాయం మరియు సంక్షేమ అవకాశాలు చేరేలా చూడటం న్యాయ సేవా సంస్థల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.ఏళ్ల తరబడి గుర్తింపు పత్రాలు లేకుండా, కుటుంబ సభ్యుల ఆచూకీ తెలియని పరిస్థితుల్లో జీవిస్తున్న పలువురు ఆశ్రయితులకు ఈ ఆధార్ నమోదు శిబిరం కొత్త ఆశాకిరణంగా మారింది. గుర్తింపు, సంక్షేమ సేవల ప్రాప్తి, కుటుంబాలతో తిరిగి కలిసే అవకాశాలకు ఈ కార్యక్రమం మార్గం సుగమం చేయనుంది.

# రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలి

**పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి:ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు**

**ఖమ్మం, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రు లపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని, ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో జిల్లా అధ్యక్షుడు వంకాయల రాజు అధ్యక్షతన జరిగిన ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య క్రమంగా వ్యాపారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులను భారీగా పెంచి విద్యార్థుల తల్లిదండ్రు లను దోచుకుంటున్నాయని విమర్శించారు. ఒకే విద్యాసంస్థలో వివిధ పేర్లతో ట్యూషన్ ఫీజులు, బిల్డింగ్ ఫీజులు, అభివృద్ధి నిధులు, ట్రాన్స్‌పోర్ట్, ఇతర చార్జీల పేరుతో వేలాది రూపాయలు అదనంగా వసూలు



చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. విద్య హక్కు అయినప్పటికీ రాష్ట్రంలో విద్యను వస్తువుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లాలో విద్యార్థుల సమస్యలపై విస్తృతంగా చర్చించి, పాఠశాలలు, కళాశాలల సందర్శనలు చేపట్టి సమస్యలను గుర్తించి ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలు మూసివేయాలని, జిల్లా అధికారులు పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థలలో తనిఖీలు చేసి దుకాణాలు సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దొంతపోయిన వెంకటేష్, రెడ్డి పోగుల. త్రినాథ్, భాను శ్రీకర్, శ్యామ్, లోహిత్ కుమార్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా, మహిళా, యువజన కమిటీల నియామకం

## ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా పదిశాల నవీన్ కుమార్ నియామకం

**ఖమ్మం, (జనంసాక్షి) :**

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మహిళా, యువజన కమిటీలకు నూతన నాయకులను నియమిస్తూ గురువారం ప్రకటన విడుదల చేసింది. సంఘం జాతీయ అధ్యక్షుడు తీగల అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సామాజిక సేవ, నాయకత్వ నైపుణ్యం, ఎస్సీ వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని గుర్తించి ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా పదిశాల నవీన్ కుమార్, జిల్లా కార్యదర్శిగా దుమాల నాగరాజు నియమితులయ్యారు. అలాగే రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన ఇతర నాయకులకు కూడా వివిధ బాధ్యతలు అప్పగించారు. ఎస్సీ సంక్షేమ సంఘం ద్వారా షెడ్యూల్డ్ కులాల సామాజిక, ఆర్థిక, విద్యా మరియు రాజకీయ సాధికారత కోసం కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం, యువతకు ఉపాధి అవకాశాలపై మార్గదర్శకత్వం ఇవ్వడం, సామాజిక న్యాయం కోసం కృషి చేయడం వంటి కార్యక్రమాల్లో సంఘం చురుకుగా పాల్గొంటోంది. నూతనంగా నియమితులైన నాయకులు ఎస్సీ వర్గాల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలు, సామాజిక అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని జాతీయ అధ్యక్షుడు తీగల అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ నియామకాలతో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంఘం కార్యకలాపాలు మరింత





బలోపేతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన నాయకులకు సంఘం సభ్యులు, సామాజిక కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్ష

ప్రణాళిక రూపొందించి క్రమం తప్పకుండా పురోగతిని సమీక్షించాలని కమిషనర్ అన్నారు.సమీక్షలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ జిల్లాలో పురోగతిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. జవహర్ లిఫ్ట్ ఇర్రిగేషన్ ప్రాజెక్ట్ కు సంబంధించి 11 గ్రామాల్లో 193.15 ఎకరాల భూసేకరణ అవార్డ్ దశలో ఉందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇర్రిగేషన్ ప్రాజెక్టు కు సంబంధించి 14వ ప్యాకేజి క్రింద 650.22 ఎకరాల భూ సేకరణ లో 623.02 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసినట్లు కలెక్టర్ అన్నారు. 15వ ప్యాకేజీకి సంబంధించి 198.13 ఎకరాల భూసేకరణ కు గాను అవార్డ్ పాస్ చేసి, భూనిర్వాసితులకు పరిహారం చెల్లించామన్నారు. ప్యాకేజి16 కు సంబంధించి 820.12 ఎకరాలకు గాను అవార్డ్ పాస్ చేసినట్లు, 796.13 ఎకరాలకు పరిహారం చెల్లింపులు పూర్తి చేసి స్వాధీనం చేసుకున్నట్లు, మిగతా భూమికి పరిహారం ప్రభుత్వం నుండి రావాల్సి ఉన్నట్లు తెలిపారు. ప్యాకేజి 6, 2, 1 లకు సంబంధించి భూసేకరణ పురోగతిలో ఉందన్నారు. భూసేకరణ ప్రక్రియ వేగవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఇర్రిగేషన్ సిఈ లు ఎం. వెంకటేశ్వర్లు, శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎస్డీసి సదానందం, ఇర్రిగేషన్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రీప్రైమరీపాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహణ

**కల్లూరుజూన్ 18 (జనంసాక్షి)** కల్లూరు మండలంలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఆరు పాఠశాలల్లో



ప్రారంభం కానున్న ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ కు సంబంధించి ఆయాలు, ఇన్స్టక్టర్ ల ఎంపికల కోసం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు.కల్లూరు మండల పరిషత్ ప్రాథమికపాఠశాల,ఎంపీయుపిఎస్ అంబేద్కర్ నగర్, ఎంపీపీ ఎస్.నారాయణపురం, ఎంపీ యుపిఎస్ మరల పాడు, ఎంపీపీ ఎస్ చిన్న కోరుకొండి, ఎంపీపీ ఎస్ కొత్త బోడిమల్లి పాఠశాలలందు ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభించనున్నారు. పాఠశాలల నిర్వహణకు ప్రీ ప్రైమరీఎడ్యుకేషన్ కు సంబంధించి మండల విద్యాశాఖ అధికారి పత్తిపాటి నివేదిత ఆధ్వర్యంలో ఇటీవల అర్హులైన అభ్యర్థుల నుంచి ఈనెల 8, 9 తేదీలలో దరఖాస్తులను స్వీకరించడం జరిగింది. స్థానికులైన వారు ఆయాల విద్యార్హత ఏడవ తరగతి ఉత్తీర్ణత, ఇన్స్టక్టర్లకు కనీస విద్యార్హత ఇంటర్ పాస్ , అధికారులు ప్రకటించడంతోబీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, బీఈడీ, ఎంబీఏ చదివిన నిరుద్యోగులు అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకోవడం జరిగింది. ఈ మేరకు ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులను ఆయాలు ఇన్స్టక్టర్ పోస్టుల ఎంపిక కోసం కల్లూరు తాసిల్దార్ బ్రహ్మేశ్వర రావు ఎంపీడీవో చంద్రశేఖర్ ఎంఈఓ నివేదిత ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.

## ఇందిరమ్మ గృహాల మంజూరి ధృపత్రాలు అందించిన ఎమ్మెల్యే మట్టారాగమయి

**కల్లూరు జూన్ 18(జనం సాక్షి)** కల్లూరు మండల పరిధిలోని లక్ష్మీపురం, చంద్రుపట్ల, రఘునాథ గూడెం గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు రెండో విడత మంజూరైన ఇందిరమ్మ గృహాలకు సంబంధించి పట్టా ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ గురువారం అందజేశారు. ఈ మేరకు సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్లూరు మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు, పట్టణ కమిటీ అధ్యక్షులు షేక్ ఉస్మాన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు భాగం ప్రభాకర్ చౌదరి, లక్ష్మీపురం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ భూక్యకృష్ణ, మాజీ ఎంపీటీసీ కుక్కా నాగమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు కళ్యాణపు సైదులు, తదితరుల సమక్షంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు అందించారు.



# ప్రాణాలతో చెలగాటం

అకస్మాత్తుగా అనుమతి లేదంటూ పరిశ్రమ యాజమాన్యం అడ్డుకున్నారు. ఈ వాహనాల నుండి ఘాడమైన వాసన రావడంతో ఈ వాహనాలను మైహోమ్ సిమెంట్ పరిశ్రమ వద్ద నుండి వేపల మాదారం దారిలో గల ప్రభుత్వ భూమిలో దాచి పెట్టారు. ఈ వాహనాలు ఎక్కువసేపు ఇక్కడ ఉండటం వలన రసాయనాలు వాతావరణంలో, భూమిలో కలిసి ఇక్కడ పశువులకు ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. మైహోమ్ సిమెంట్ పరిశ్రమకు దిగుమతి కోసం రాగా ఆ పరిశ్రమ యాజమాన్యం వారు ఈ లారీలను ఇక్కడ దాచి పెట్టారని వాహన డ్రైవర్లు చెబుతున్నారు. పరిశ్రమలో పెద్ద సార్లు వచ్చారని అందుకే ఈ వాహనాలు ఇక్కడ ఉంచారని సెక్యూరిటీ సిబ్బంది చెప్పుకొస్తున్నారు. ఈ లారీల వద్ద వెలువడే గాడమైన వాసనకు తట్టుకోలేక లారీ డ్రైవర్లు సైతం ఈ లారీలకు చాలా దూరంలో మాఖం వెయ్యడం కొసమెరుపు.

**ఏమిటి ఈ ప్రాణాంతక వ్యర్థ రసాయనాలు..?**

ముడి సున్నపురాయిని అధిక ఉష్ణోగ్రత వద్ద బొగ్గుతో మండిస్తే సిమెంటుతయారీకి కావాల్సిన పదార్ధంగా తయారవుతుంది. బొగ్గు ధర ఎక్కువగా ఉండడం. వ్యర్ధ రసాయనాలు తక్కువ ధరకు దొరకడం వల్ల సిమెంటు యాజమాన్యాలు ప్రజా ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా రసాయన వ్యర్ధాలను పరిమితికి మించి వినియోగిస్తున్నారు. బొగ్గుకు సర్ఫోరిక్ యాసిడ్ను కలిపినట్లయితే ఎక్కువసేపు మండడంతో పాటు అధిక ఉష్ణోగ్రత వెలబడుతుంది. దీని నుంచి వెలువడిన హానికర రసాయన పదార్ధాలను పట్టించుకోకుండా ఖర్చు తగ్గించుకోవడమే ధ్యేయంగా సదరు ఫ్యాక్టరీలు కొన్ని ఏండ్లుగా వ్యర్థ రసాయనాలు వినియోగిస్తున్నారు.దీనివల్ల జీవులను అనేక రోగాలుగా వచ్చే ప్రమాదంముంది. అంతేకాక ఇది భూగర్భ జలాలను కలుషితం చేస్తుంది. సల్ఫోరిక్ ఆమ్లం ఎక్కువసేపు మండటం వల్ల గాలిలో కార్బన్డయాక్సైడ్ శాతం పెరిగి అధిక ఉష్ణోగ్రత నమోదు అవుతాయి. ఇప్పటికే మేళ్లచెరువు ఉమ్మడి మండలంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు గా నమోదవుతున్నాయి.

**పరిమితికి మించి రసాయనాల వినియోగం**

బొగ్గును, క్లింకర్ ను మండించేందుకు ఈ వ్యర్ధ రసాయనాలను పరిమితి మించి వినియోగిస్తున్నారన్న ఆరోపణలు స్థానికులు నుండి వ్యక్తం అవుతున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల గల ఫార్మా కంపెనీలు ఈ సిమెంట్ పరిశ్రమలకు ఎదురు డబ్బులు ఇచ్చి ఈ వ్యర్థాలను దిగుమతి చేస్తున్నట్లు సమాచారం. ఉచితంగా వస్తుండడంతో రోజుకి రెండు లారీలు మాత్రమే వినియోగించాల్సిన చోట ఏకంగా రోజుకి 15 నుండి 20 లారీల వ్యర్థ రసాయనాలను వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాదు రెండు రోజులు పరిశ్రమలోకి ఈ లారీలను అనుమతించకపోవడంతో ఇక్కడ 30కి పైగా వాహనాలు నిలిచిపోవడంతో ఈ రసాయన వినియోగం పరిమితికి మించి జరుగుతుందని స్పష్టంగా అర్థం అవుతుంది. మైహోమ్ సిమెంట్ పరిశ్రమలో ఆడిట్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ సమయంలో ఈ వ్యర్థ రసాయన వాహనాలను లోపలికి అనుమతించడం లేదంటే నే అర్థమవుతుంది ఈ వ్యర్థ రసాయనాల వాడకం ఎంత ప్రమాదము...! నిషేధమే..!అధిక మొత్తంలో ఈ రసాయనాలను వినియోగించి సిమెంట్ ఉత్పత్తి చేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్న ఆరోపణ వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పర్యావరణ శాఖ అధికారులు స్పందించి పరిమితికి మించి నిబంధనలకు విరుద్ధంగా ఈ వ్యర్థ రసాయనాలను వినియోగిస్తున్న సిమెంట్ పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవు

తుంగతుర్తి జూన్ 18 (జనం సాక్షి)

రైతులకు ఆర్థికంగా నష్టం కలిగించే నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చట్టరీత్య చర్యలు తప్పవని అలాంటి వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏం యెన్ పి ఎం పథకం కింద రైతులకు ఉచితంగా కందులు మరియు పెసర్ల బ్యాగులను పంపిణీ చేసి మాట్లాడారు. నకిలీ విత్తనాలు అరికట్టడంలో వ్యవసాయ అధికారులు కీలకంగా పని చేయాలన్నారు. నకిలి విత్తనాలు అమ్మినట్లు మండలాలలో తెలిస్తే అట్టి అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం వివిధ మండలాల ఏఓలతో మీ మండలాల్లో వరి, పెసర్లు, పత్తి, కందులు, వేరుశనగ పంటలు ఎన్ని ఎకరాల్లో పండించారో వివరణ అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కు సన్నద్ధమవుతున్న రైతులకు సరిపడ యూరియా, డీఏపీ, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు రైతులకు సరిపడా యూరియా నిలువలు ఉంచి రైతులకు యూరియా అప్ పై అవగాహన కల్పించాలన్నారు, రైతులు ఒక్క వరి పైనే ఆధారపడకుండా చిరు ధాన్యాల పంటలను పండించాలన్నారు. పంట మార్పిడి విధానంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు గుడిపాటి సైదులు, నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, పాలెపు చంద్రశేఖర్, ఏడీఏ రమేష్ బాబు, సర్పంచ్ మల్లెపాక సాయిబాబా, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తోడుసు లింగయ్య, నాయకులు దాసరి శ్రీను, పెద్ద బోయిన అజయ్, ఉప్పుల రాంబాబు, మాచర్ల అనిల్ , కొండ రాజు, ఇంఛార్జ్ ఎంపీడీవో సందీప్, అధికారులు, వివిధ మండలాల ఏఓలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.





# ఈదమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామాలకు రక్షణ: ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

**వైభవంగా ఈదమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం**

పెద్దవూర, జూన్ 18 (జనంసాక్షి )

గ్రామ దేవతలను ప్రతిష్టించడం ద్వారా గ్రామాలపై దుష్ట శక్తుల ప్రభావం ఉండదని అమ్మవారి కృపతో గ్రామాలు సురక్షితంగా ఉంటాయని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు నల్గొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఈదమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ఈదమాంబా దేవి విగ్రహానికి పుణ్యజలాలతో అభిషేకం చేశారు అనంతరం ఆలయంలో నిర్వహించిన నవగ్రహ మోగిని వాస్తు క్షేత్రపాలక పూజా కార్యక్రమాలలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, పెద్దవూర సర్పంచ్ ఐతగోని వెంకటయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు పబ్బు యాదగిరి గౌడ్ పాల్గొన్నారు. అలాగే యువజన నాయకులు మురళి, సతీష్ గౌడ్, మేకల శ్రీకాంత్, మునిరెడ్డి, బ్రహ్మారావు, అంజిరెడ్డి, ఊరె లక్ష్మణ్, శేఖర్, వెంకట్ రెడ్డి మరియు పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నేరేడుచర్ల (జనంసాక్షి)

ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి వెళ్ళనున్న నేరేడుచర్ల బిఆర్ఎస్ నాయకులను గురువారం పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్నటువంటి కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు.ప్రజలకు కావలసి సంక్షేమం, రాష్ట్రాన్ని కావలసి అభివృద్ధి గురించి పట్టించుకోకుండా ప్రజలను పక్కదోవ పట్టిస్తుందన్నారు. ప్రశ్నింస్తున్న తెలంగాణ ప్రజలు అమాయకులు కారని,ఉద్యమం నుండి పాలన దాకా అన్నింటినీ చూశారన్నారు. పాలనలో పూర్తిగా విఫలమైన రేవంత్ సర్కార్ ఎన్ని డ్రామాలకు పాల్పడినా ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయమన్నారు. అరెస్ట్ అయిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్,నియోజకవర్గ ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు లావుడియా శ్రీను నాయక్,నాయకులు చిట్యాల శ్రీను,ఇనుపాల పిచ్చిరెడ్డి,జింకల భాస్కర్ ఉన్నారు.



# పి.ఏ.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా శ్రీనివాసరావు.!

- గత ఆరు సంవత్సరాలుగా జడ్పీహెచ్ఎస్ పి.ఏ.పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు నిర్వహణ
- పది ఫలితాలలో తోటి ఉపాధ్యాయుల సమిష్టి కృషితో మంచి ఫలితాలు

**పి.ఏ.పల్లి,జూన్ 18(జనంసాక్షి):**

పి.ఏ.పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జె.శ్రీనివాస రావు జూలై 2018 నుండి జూన్ 2024 వరకు గత ఆరేళ్లుగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా ముందుండి తోటి ఉపాధ్యాయుల తోడ్పాటు,సహకారంతో పాఠశాలకు,విద్యార్థులకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాడు.అదేవిధంగా ఆయన ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు మంచి బాటలు వేశాడు. తల్లిదండ్రులు లేని పిల్లలకు ఒక తండ్రిగా, గురువుగా వారి బాటలకు పునాది వేశాడు. మరొకమారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పి.ఏ. పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించుతున్న వేళ తోటి ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి మరియు శాలువాతో సన్మానం చేసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే తన లక్ష్యం అని అన్నారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు,మధ్యాహ్న భోజన వసతి ప్రవేశపెడుతున్నదని అన్నారు.టెట్,బిఈడి క్వాలిఫై అయి అనుభవమైన ప్రభుత్వ ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటున్నదని, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తెస్తానని ఆయన అన్నారు.విద్యార్థులు మరియు తోటి ఉపాధ్యాయుల సమిష్టి కృషితో వచ్చే సంవత్సరం పది ఫలితాలలో పాఠశాలను మండలంలో మొదటి స్థానంలో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.జీవన్ కుమార్, జె.శ్రీనయ్య,వి.వెంకటేశ్వర్లు,ఈ.వెంకటమ్మ, సిఓ.ఆమటి నరేష్ కుమార్,అటెండర్ అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ లో జరుగు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

**నాంపల్లి,జూన్ 18 (జనంసాక్షి)**

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 20వ మహాసభలు ఈనెల 20 ,21, 22 తేదీలలో మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం నాంపల్లి మండల కార్యదర్శి కొమ్ము లక్ష్మయ్య ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి తెలియజేశారు గురువారం రోజున నాంపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభల కరపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభల్లో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న భూమి ఉపాధి కూలీ విద్యా వైద్యం లాంటి సమస్యలపై చర్చించనున్నట్లు అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న దానికి నిరసనగా కార్మికుల్ని చైతన్యపరిచి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం చేస్తామని తెలిపారు ఈ మహాసభలకు రాష్ట్రం నలుమూల నుండి 1000 మంది ప్రతినిధులు గ్రామీణ ప్రాంతాల్లో పేదల సమస్యలపై అనేక పోరాటాలు నడిపిన కూలి సంఘం నాయకులు పాల్గొంటున్నారని అన్నారు.20 తారీకున భారీ బహిరంగ సభ వేలాది మందితో నిర్వహిస్తున్నట్లు ఈ బహిరంగ సభలో త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత అధ్యక్షులు విజయ రాఘవన్ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ రాజ్యసభ సభ్యులు శివదాస్ పాల్గొని ప్రసంగిస్తారు ఈ మాహా సభలలో వేలాది నంది వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నాము ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కామనబోయిన ఈశ్వరయ్య, జిల్లా కమిటీ సభ్యురాలు బెల్లి జయప్రద, పూల సైదమ్మ,పెరుమండ్ల రాజు, కప్పెర లక్ష్మయ్య, దోటి సత్తమ్మ, సింగారపు ఇందిరమ్మ, యాదయ్య, భాగ్యమ్మ, రాములు, ఉడుత బిక్షం, తదితరులు పాల్గొన్నారు



# ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలి..

## సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు ఓర్సు పెంటయ్య



**కనగల్లు జూన్ 18 (జనంసాక్షి)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కురంపల్లి సర్పంచ్ ఓర్స్ పెంటయ్య పేర్కొన్నారు. కురంపల్లి గ్రామానికి చెందిన ధోటి సైదులు-చంద్రకళ దంపతులకు ఇందిరమ్మ (గృహలక్ష్మి) పథకం ద్వారా మంజూరైన ఇల్లును సకాలంలో పూర్తి చేసుకున్నారు. గురువారం గృహప్రవేశాలకు అనువైన రోజు కావడంతో వారి ఆహ్వాన మేరకు ఆ గ్రామ సర్పంచి ఓర్సు పెంటయ్య వెళ్లి ఇంటి లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం ప్రవేశపెట్టిన మొదటగా ఆ పథకంలో లబ్ధి పొందేది నిరుపేద లేనని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా గ్రామంలో ఏ సంక్షేమ పథకం వచ్చిన గూడు లేని నిరాశ్రయులకు గుర్తించి వారికిఆశ్రయం కల్పించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామంలోని ఉన్న సమస్యలను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరించేందుకు ప్రజల పక్షాన కృషి చేస్తారని తెలియజేశారు అనంతరం గృహ లబ్ధిదారులు సర్పంచ్ తో పాటు ప్రజా ప్రతినిధులను శాలువా లతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిరీష, ఉప సర్పంచ్ శీలం లక్ష్మారెడ్డి, దోటి వెంకన్న, దో టిరవి, బొమ్మ కంటి నరసింహస్వామి, వలికి సురేష్, కావలి స్వామి, బోనగిరి దుర్గాప్రసాద్, సోము రామన్న, తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

## నిరుపేద కుటుంబానికి రూ. 2 లక్షల ఆర్థిక సాయం!

**చండూర్, జూన్ 18 (జనంసాక్షి)**
ఆరోగ్యం క్షీణించి, వైద్య ఖర్చులకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్న ఒక నిరుపేద కుటుంబానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కొండంత అండగా నిలిచారు. మానవత్వంతో స్పందించి ఆ కుటుంబానికి రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చండూర్ మండలం పుల్లెంల గ్రామానికి చెందిన పెసర్ల చింతయ్య పెద్ద కుమారుడు పెసర్ల గౌతమ్ గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండటంతో, కుటుంబ సభ్యులు అప్పులు చేసి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ నిరుపేద కుటుంబం పడుతున్న ఆర్థిక ఇబ్బందుల గురించి పుల్లెంల గ్రామ కాంగ్రెస్ నాయకులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. గౌతమ్ చికిత్స నిమిత్తం రూ. 2 లక్షల ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, బుధవారం సాయంత్రం రూ. 2 లక్షల విలువైన చెక్కును పుల్లెంల కాంగ్రెస్ నాయకుల ద్వారా పెసర్ల చింతయ్య కుటుంబానికి అందజేశారు. సకాలంలో స్పందించి పెద్ద మనసుతో ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చెక్కు పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కముల వెంకన్న, ఉప సర్పంచ్ చెడుబుద్ధి ఉషయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు వడ్డగోని చంద్రశేఖర్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు సీత యాదయ్య, వడ్డగోని రాఘవేందర్, చండూర్ మాజీ పీఏసీఎస్ చైర్మన్ బొబ్బలి శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు మందడి శంకర్ రెడ్డి, మాజీ గ్రామశాఖ అధ్యక్షులు ఇరిగి వెంకన్న, గండు కేశవులు, వార్డు మెంబర్లు భూతరాజు బాలరాజు, రసాల మంజుల వెంకన్న, మాజీ వార్డు మెంబర్లు ఇరిగి బుచ్చయ్య, పోలే చంద్రయ్య, సీత మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# స్మశాన వాటిక స్థలం, కనకదుర్గ గుడి, భూముల ఆక్రమణ పై తహసిల్దార్ వినతి

**నేరేడుచర్ల (జనంసాక్షి ):**
మున్సిపాల్టీ పరిధిలో రామాపురంలో స్మశాన వాటిక స్థలం, కనకదుర్గ గుడి దేవుని మణ్యం భూములు అక్రమణ జరుగుతున్నాయని గ్రామస్తులు తహసిల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, మున్సిపల్ ఛైర్మన్ కొణతం చిన వెంకట్ లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ స్మశాన వాటిక స్థలం కనకదుర్గమ్మ గుడి చెందిన దేవుని మణ్యం భూములు ఉన్నాయని. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చింతమల్ల సైదులు, అక్రమంగా చెట్లను తొలగించి, భూమిని చదును చేసి ఆక్రమించుకున్నారని,అట్టి స్థలంలో ఎస్.సి. కార్పోరేషన్ నిధుల నుండి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టి, అసంపూర్తిగా నిర్మించి,అట్టి నిధులను దుర్వినియోగం చేశారని, ఇప్పుడు అట్టి కమ్యూనిటీ హాల్ ని కూడా నాదే చెప్పుచున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చందమల్ల జయబాబు, మాజీ సర్పంచ్ జంగిలి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పోకబత్తిన శేఖర్,కొదమగుండ్ల నాగరాజు,మెండే జానయ్య, పాపయ్య, గంట సతీష్ తదితరులు ఉన్నారు.

# మానవత్వం చాటుకున్న డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్

**శాలిగౌరారం జూన్ 18(జనంసాక్షి)**
సొంత ఊరిపై మమకారంతో పాటు కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో పవన్ సాయి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. తుడిమిడి గ్రామానికి చెందిన బట్ట పెద్ద గోపాల్ ఇటీవల అనారోగ్యం తో మరణించడం పట్ల ఆయన తీవ్రగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. పెద్ద గోపాల్ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రోజున మృతుడి నివాసానికి చేరుకున్న డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్,బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ఈ కష్టసమయంలో వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ, తక్షణ సహాయం కింద రూ. 10,000 పది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.
ఈ కార్యక్రమంలో బాకీ వెంకటయ్య, కుంభం రమేష్, గిరి లతో పాటు గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు, గ్రామస్థులు పాల్గొన్నరు .

# ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు జర్నలిజం

## నిజాన్ని నిర్భయంగా చెప్పే కలం శక్తి



సమాజంలో జరిగే ప్రతి సంఘటనను ప్రజలకు చేరవేసే వేదిక జర్నలిజం. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం, ప్రజాప్రతినిధులను ప్రశ్నించడం, అవినీతిని వెలికితీయడం, సామాజిక మార్పుకు దోహదపడడం వంటి కీలక బాధ్యతలను జర్నలిజం నిర్వహిస్తుంది. అందుకే ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిజాన్ని "నాలుగో స్థంభం"గా అభివర్ణిస్తారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు సమాచారం తెలుసుకునే హక్కు ఉంది. ఆ హక్కును కాపాడే సాధనమే మీడియా. గ్రామంలో తాగునీటి సమస్య నుంచి దేశ భద్రత వరకు, రైతు కష్టాల నుంచి పార్లమెంట్ చర్చల వరకు ప్రతి అంశాన్ని ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తారు. అధికార యంత్రాంగం పనితీరును పర్యవేక్షిస్తూ, ప్రజల తరఫున ప్రశ్నిస్తూ సమాజానికి అద్దం పట్టే బాధ్యతను మీడియా నిర్వర్తిస్తుంది. జర్నలిజం చరిత్ర భారతదేశంలో స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో జర్నలిజం అత్యంత కీలక పాత్ర పోషించింది. బ్రిటీష్ పాలనలో ప్రజల్లో జాతీయ చైతన్యం పెంచేందుకు పత్రికలు ఒక ఆయుధంగా పనిచేశాయి. మహాత్మా గాంధీ, బాలగంగాధర్ తిలక్ వంటి నాయకులు పత్రికల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. తెలంగాణలో కూడా ప్రజా ఉద్యమాలు, సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా ముఖ్య పాత్ర పోషించింది.

**మారుతున్న జర్నలిజం**

ఒకప్పుడు వార్తల కోసం ప్రజలు మరుసటి రోజు ఉదయం పత్రిక కోసం ఎదురుచూసేవారు. ఆ తర్వాత రేడియో, టెలివిజన్ వచ్చాయి. ఇప్పుడు డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్‌లోనే క్షణాల్లో వార్తలు అందుబాటులోకి వస్తున్నాయి. సోషల్ మీడియా, వెబ్ మీడియా, యూట్యూబ్ ఛానళ్ల ప్రభావంతో వార్తల ప్రసారం వేగవంతమైంది. సాంకేతికత జర్నలిజాన్ని మరింత విస్తరించినప్పటికీ, అదే సమయంలో కొత్త సవాళ్లను కూడా తెచ్చింది. వార్తలను ముందుగా అందించాలనే పోటీలో కొన్నిసార్లు వాస్తవ నిర్ధారణకు తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫేక్ న్యూస్, తప్పుడు ప్రచారాలు, సోషల్ మీడియా వదంతులు సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం పెరిగింది. జర్నలిస్టు బాధ్యత జర్నలిస్టు కేవలం వార్తలు రాసే వ్యక్తి మాత్రమే కాదు. సమాజ సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపే దిశగా చర్చను ముందుకు తీసుకెళ్లే వ్యక్తి. ప్రజల గొంతుకగా నిలిచి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే వారధి. ఒక మంచి జర్నలిస్టుకు నిజాయితీ, నిష్పాక్షికత, ధైర్యం, సామాజిక బాధ్యత అత్యంత అవసరం.
ప్రజా సమస్యలపై నిరంతరం కథనాలు ప్రచురించడం ద్వారా అనేక గ్రామాలకు రహదారులు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్, వైద్య సేవలు అందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. చిన్న వార్తగా ప్రారంభమైన అనేక అంశాలు పెద్ద చర్చలకు దారి తీసి ప్రభుత్వాలను చర్యలు తీసుకునేలా చేశాయి.

**గ్రామీణ జర్నలిజం ప్రాధాన్యత**

గ్రామీణ ప్రాంతాల్లో జర్నలిజం మరింత కీలకం. పట్టణాల్లో వార్తలు సులభంగా వెలుగులోకి వస్తాయి. కానీ గ్రామాల్లోని సమస్యలు చాలాసార్లు బయటకు రావు. అలాంటి సందర్భాల్లో గ్రామీణ విలేకరులు ప్రజల కష్టాలను ప్రపంచానికి తెలియజేస్తారు. రైతుల సమస్యలు, తాగునీటి కొరత, పాఠశాలల దుస్థితి, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలను వెలుగులోకి తీసుకురావడంలో గ్రామీణ జర్నలిస్టుల పాత్ర అమూల్యం. సవాళ్లు మరియు భవిష్యత్తు నేటి జర్నలిజం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. వార్తల కంటే వేగానికి ప్రాధాన్యత పెరగడం, ఫేక్ న్యూస్ విస్తరణ, ఆర్థిక ఒత్తిళ్లు, సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలు మీడియా విశ్వసనీయతకు పరీక్షగా నిలుస్తున్నాయి. అయినప్పటికీ నిజం కోసం పోరాడే జర్నలిస్టులు సమాజానికి ఆశాకిరణాలుగా నిలుస్తున్నారు. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు (ఎఐ), డిజిటల్ టెక్నాలజీ జర్నలిజాన్ని మరింత మార్చనున్నాయి. అయినప్పటికీ ఒక అంశం మాత్రం ఎప్పటికీ మారదు. అది నిజాన్ని ప్రజల ముందుకు తీసుకురావాలనే జర్నలిజం ధర్మం. జర్నలిజం కేవలం ఒక వృత్తి కాదు. అది సమాజానికి సేవ చేసే బాధ్యత. ప్రజల సమస్యలకు గొంతుక, ప్రజాస్వామ్యానికి రక్షకుడు, అధికారాన్ని ప్రశ్నించే శక్తి, సమాజానికి మార్గదర్శి. నిజం కోసం నిరంతరం పోరాడే కలం ఉన్నంతకాలం ప్రజాస్వామ్యం బలంగా ఉంటుంది. "నిజాన్ని రాయడం జర్నలిస్టు ధర్మం... ప్రజల తరఫున ప్రశ్నించడం జర్నలిజం పరమార్థం."

**చింతల నర్సయ్య జనం సాక్షి విలేఖరి మోత్కూర్**

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం..

## గోల్లపాడులో కాంగ్రెస్ పార్టీ విలేకరుల సమావేశం



**ఖమ్మం రూరల్, జూన్ 18:( జనంసాక్షి)**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, ఆ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు నిరాధార విమర్శలకు దిగుతున్నాయని ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వీరభద్రం అన్నారు.గురువారం గోల్లపాడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు...రాష్ట్ర ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అనేక పథకాలను అమలు చేస్తోం దని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ లబ్ధి కోసం కొందరు నేతలు విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని వర్గాలకు మేలు చేస్తున్నాయని చెప్పారు. ప్రతిపక్షాలు విమర్శలకే పరిమితం కాకుండా నిర్మాణాత్మక సూచనలు చేస్తే ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని సూచించారు.

**పాలేరులో మళ్లీ కాంగ్రెస్ జెండానే ఎగురుతుంది..**
పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు మరింత బలపడుతోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మద్ది వీరారెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో గతంలో కంటే భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో లభించిన భారీ మెజార్టీని మించి ఈసారి మరింత ప్రజాభిమానంతో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించే పరిస్థితులు ఉన్నాయని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్ పార్టీకి బలమని తెలిపారు. ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తులో కూడా ప్రజల మద్దతు లభించే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమం వైపే నిలుస్తున్నారని, పాలేరులో మరోసారి కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లింగ శ్రీనివాసరావు, చింతపల్లి మాజీ సర్పంచ్ ముత్యం కృష్ణారావు, గనిగంటి సురేష్, రుద్ర ఉపేందర్, శ్యామల రామ్ రెడ్డి, గంగిరెడ్డి, కొండం మధు, వెల్లుర్తి నారాయణ, సోషల్ మీడియా బద్రి సాయి తదితరులు పాల్గొన్నారు.



**జర్నలిస్టుల సంక్షేమ సహాయం నిధి నుండి ఇటీవల మరణించిన విలేకరి బుయ్య శివ నాగరాజు కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం**
**- ప్రతి విలేఖరి కుటుంబానికి అండగా ఉంటాం**
**- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**

**పి.ఏ.పల్లి,జూన్ 18(జనంసాక్షి):**
పి.ఏ.పల్లి మండల కేంద్రానికి చెందిన బుయ్య శివ నాగరాజు గతంలో ప్రజాపక్షం విలేకరిగా పని చేసేవాడు.తోటి విలేకరులతో, మిత్రులతో ఎంతో కలివిడిగా కలిసిమెలిసి ఉండేవాడు.ఇటీవల ఆయన అనారోగ్యంతో మరణించాడు.దీంతో ఆయన చనిపోయిన విషయాన్ని స్థానిక విలేకరులు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకుపోయారు.దీంతో మీడియా అకాడమీ సంక్షేమ సహాయ నిధి నుండి బుయ్య శివ నాగరాజు కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును బుధవారం నాడు హైదరాబాదులో ఆయన భార్యకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విలేకరి కుటుంబానికి మీడియా అకాడమీ అండగా ఉంటుందని ఆయన అన్నారు.అదేవిధంగా బాధిత కుటుంబానికి ప్రతినెలా పెన్షన్ అందుతుందని,ఈ పెన్షన్ ఐదేళ్లపాటు కొనసాగిస్తామని ఆయన అన్నారు.నాగరాజు కుటుంబానికి మీడియా అకాడమీ సంక్షేమ సహాయనిధి తరపున సహాయం అందించడంతో తోటి విలేకరులు,కుటుంబ సభ్యులు ప్రెస్ క్లబ్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మరియు రాష్ట్ర ప్రెస్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

# రాయరావుపేటలో అర్హులకు ఇంటి స్థలాలను కేటాయించాలి

**బీబీనగర్ (జనంసాక్షి):**
మండలంలోని రాయరావుపేట గ్రామ పరిధిలో గల ప్రభుత్వ స్థలంలో అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలను కేటాయించాలని గ్రామ సర్పంచ్ బొర్ర రమేష్ కోరారు. గ్రామ పరిధిలోని 178 సర్వే నెంబర్ భూమిలో ఇంటి స్థలాలను కేటాయించాలని కోరుతూ గురువారం మండల తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి కి సర్పంచ్ రమేష్ తో పాటు పాలకవర్గ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు . గతంలో 178 సర్వే నెంబర్ లోని అర్హులైన లబ్ధిదారులకు పట్టా పత్రాలను ఇచ్చి రద్దు చేయడం జరిగిందని, తిరిగి వాటిని పునరుద్ధరించాలని తాసిల్దార్ ను కోరారు. రెండో విడత ఇందిరమ్మ ఇంటి పథకంలో లబ్ధిదారులు తమ ఇళ్లను నిర్మించు కోవడానికి సర్వే నెంబర్.178 ప్రభుత్వం భూమిలో స్థలాలను కేటాయించాలని సర్పంచ్ వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ గ్రామంలోని సొంత ఇంటి స్థలాలు లేని నిరు పేదలకు ప్రభుత్వం ద్వారా స్థలాలను ఇప్పించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివ, వార్డు సభ్యులు త్రిపుర బోయిన జంగమ్మ జంగయ్య, రొంపి ఆనంద్, ఎర్రబెల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

### మరో వ్యక్తికి గాయాలు



**హాలియా: జనం సాక్షి**
హాలియా మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మదారిగూడెం గ్రామానికి చెందిన షేక్ నన్నే జానీ, ఎడవెల్లి యెసోబుతో కలిసి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నన్నే జానీ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. యెసోబు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పిండిప్రోలులో విత్తన దుకాణాల తనిఖీ

**తిరుమలయపాలెం, జూన్ 18 (జనంసాక్షి )**
మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో గురువారం వ్యవసాయ, పోలీస్ అధికారులు ఉమ్మడిగా విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి (ఏఓ) శ్రీనారెడ్డి సీతారామరెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) కూచిపూడి జగదీష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి.ఈ సందర్భంగా దుకాణాలలోని స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, 'ఓ' ఫామ్‌లు, జిఓటీ నివేదికలు, కంపెనీల మరియు డీలర్ల లైసెన్సులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు నిబంధనల ప్రకారం రికార్డులను నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ అగ్రికల్చరల్ ఆఫీసర్ (ఏఈఓ) కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళా కమిషన్ సభ్యులకు ఘన సన్మానం : ముఖ్య అతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**మోత్కూరు మే 29 (జనంసాక్షి):** మోత్కూర్ మున్సిపల్ పరిధిలోని మధుర మీనాక్షి ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులుగా నియమితులైన కానోజు శంకరమ్మ, చిట్యాల శ్వేతలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అధ్యక్షత వహించగా, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. కార్యక్రమం సందర్భంగా మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మహిళా కమిషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. పూలమాలలు, శాలు వాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కీలక పాత్ర పోషిస్తోం దన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారికి న్యాయం జరిగేలా కమిషన్ మరింత చురుకుగా పని చేయాలని ఆకాంక్షించారు. మహిళలపై జరిగే అన్యాయాలు, వేధింపుల నివారణలో కమిషన్ సభ్యులు సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ మహిళలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావా లని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళ లు స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణలో మహిళా కమిషన్ బాధ్యత చాలా కీలకమని పేర్కొన్నారు. కమిషన్ సభ్యులుగా నియమితులైన కానోజు శంకరమ్మ, చిట్యాల శ్వేతలు ప్రజల విశ్వాసానికి తగిన విధంగా సేవలందించాలని ఆకాంక్షించారు.అలాగే మహిళలపై జరిగే అన్యాయాల నివారణ, చట్టపరమైన అవగా హన కల్పించడం, మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం వంటి అంశాల్లో కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి సూచించారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుం దని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.



# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలి

## జిల్లా సంక్షేమ అధికారి ఎ. ప్రమీల



**ఖమ్మం, జూన్ 18 (జనం సాక్షి )**
నషా ముక్త్ భారత్ అభియాన్ వారోత్సవ కార్యక్రమాలలో భాగంగా ఖమ్మం పట్టణంలోని ఎన్ఎస్సీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 125 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి ఎ. ప్రమీల మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలను చూపుతుందని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి విద్యాభ్యాసం, క్రీడలు, వ్యక్తిత్వ వికాసం వంటి సానుకూల అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును నిర్మించుకునే దశలో ఉండటంతో చెడు అలవాట్లకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించగలరని, తమతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా అవగాహన కల్పించాలని ఆమె కోరారు. ప్రభుత్వం చేపడుతున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ఈడబ్ల్యూ డీఎంసీ ఎస్.డి. సమ్రీన్, జెండర్ స్పెషలిస్ట్ పి. ప్రమీల, ఎన్ఎంబీఏ కమ్యూనిటీ ఎడ్యుకేటర్లు మానస, ఆర్. వేణుగోపాల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు

## పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు

## పరిసరాలలో పోలీస్ పెట్రోలింగ్:పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం కార్పొరేషన్ జూన్ 18 (జనంసాక్షి)**
జూన్ 21 తేదిన ఖమ్మం కమిషనరేట్ పరిధిలో నిర్వహించే నీట్ -2026 పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 7:15 గంటల వరకు సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు ముసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# ఇష్టానుసారం ర్యాంపులు ఏర్పాటు చేసుకుని ఇసుక నిల్వచేస్తే కఠినచర్యలు

## అధికారులను ఆదేశించిన సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట.



**బూర్గంపహాడ్ జూన్ 18 (జనంసాక్షి)**
అధికారికంగా సొసైటీ సభ్యులు నడుపుకునే ఇసుక ర్యాంపు నుంచే ఇసుక రవాణా జరగాలే తప్ప ఇష్టానుసారం ర్యాంపులు ఏర్పాటు చేసుకుని మైనింగ్శాఖ, సొసైటీ సభ్యుల అనుమతి లేకుండా గోదావరి ఇసుకను తరలిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట హెచ్చరించారు. బుధవారం రాత్రి తాళ్లగొమ్మూరు పరిధిలోని గోదావరి పరిసరాల్లో ఇసుక నిల్వలను ఆయన తనిఖీ చేసి రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. మండల పరిధిలోని సోంపల్లి అధికారిక ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఈ క్రమంలో ర్యాంపులను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. సొసైటీ సభ్యులు అధికారికంగా నిర్వహించే ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక సరఫరా కావాలని, అక్రమంగా ఇసుక తరలించకుండా గోదావరి ఇసుక ఉన్న ప్రదేశాల్లో కంచెలు, కందకాలు తవ్వించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి పరిసర ప్రాంతాల్లో 24 గంటలూ నిఘా ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని, అనధికారికంగా ఇసుక తరలించే వారి వాహనాలు సీజ్ చేసి అవసరమైతే వారిని అదుపులోకి తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణా నేపథ్యంలో ఏదో ఒక సమయంలో ర్యాంపులను తనిఖీ చేస్తానని... ర్యాంపులు నిర్వహించే నిర్వాహకులు నిజాయితీగా అక్రమాలకు పాల్పడకుండా ఇసుక రవాణా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ సమ్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

**చింతకాని , జూన్ 18 (జనంసాక్షి)**
చింతకాని మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమం (బహిరంగ సభ పరిశీలన కోసం) నిర్వహించనున్న నేపథ్యంలో, తెలంగాణ డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మరియు ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచనల మేరకు ఖమ్మం కలెక్టర్ , వైరా డీఎస్పీ , వైరా సీఐ , ఇంటెలిజెన్స్ సీఐ గారు, ఎస్ఐ, మండల ఎంఆర్వో , మండల ఎంపీడీఓ, జిల్లా, మండల అధికారులు గ్రామంలో పర్యటించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి, ఉపసర్పంచ్ గాదె రామారావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూము అంజయ్య, మండల అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, మంతకేపల్లి మార్కెట్ చైర్మన్ అంభటి వెంకటేశ్వరులు, సీనియర్ నాయకుడు టి. గోవిందరావు, కాంగ్రెస్ పార్టీ చింతకాని మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొర్లపాటి అంజయ్యతో పాటు బందెల నాగరాజన్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అధికారులు సభా వేదిక, భద్రతా ఏర్పాట్లు, ప్రజల సౌకర్యాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

# బూర్గంపహాడ్ లో పోస్టుమాన్ పై కోతుల దాడి



**బూర్గంపహాడ్ జూన్ 18 (జనంసాక్షి) :**
విధి నిర్వహణలో ఉన్న పోస్టుమాన్ పై కోతులు దాడిచేసిన ఘటన గురువారం బూర్గంపహాడ్ లో జరిగినది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పోస్టాఫీస్లో పోస్టుమాన్ గా పనిచేస్తున్న నాగరాజు విధి నిర్వహణలో భాగంగా పోస్టల్ కార్డులు బట్వాడా చేసేందుకు వెళ్లగా ఓ ఇంటి వద్ద కోతులు అతనిపై ఒక్కసారిగా దాడిచేశాయి. ఈ దాడిలో గాయపడిన పోస్టుమాన్ ను స్థానికులు బూర్గంపహాడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స నిర్వహిస్తున్నారు. పంచాయతీ అధికారులు కోతులను తక్షణమే నిర్మూలించి దాడులు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# బాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే పాయం..

**బూర్గంపహాడ్ జూన్ 18 జనంసాక్షి**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఉప్పుసాక గ్రామానికి చెందిన రెంటాల వీరాస్వామికి గురువారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రూ.44వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ ఆపద సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా భరోసా లభిస్తుందని, పేద, మధ్యతరగతి కుటుంబాల వైద్యచికిత్సలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# కూతుర్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పలువురికి ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వ ఉద్యోగులు



**కల్లూరు జూన్18 (జనంసాక్షి)**
తల్లిప్రభుత్వఉపాధ్యాయు రాలు తండ్రి సబ్ కలెక్టర్ ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు అయినప్పటికీ తమ కూతురిని కల్లూరు లోని జిల్లా పరిషత్ బాలికలఉన్నత పాఠశాలలో ఆరవ తరగతిలో చేర్పించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కల్లూరు మున్సిపాలిటీ పరిధి లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్యం లో విద్యను అభ్యసించి నేడు అదే పాఠశాల పక్కన ఉన్న ఎంపీపీ పిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయు రాలుగా పనిచేస్తున్న అనిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చింతూరులో సబ్ కలెక్టర్ గా పనిచేస్తున్న గడ్డం బాలకృష్ణారెడ్డి దంపతుల కుమార్తె కృతి ప్రీతిక ను గురువారం ఆరో తరగతిలో చేర్పిస్తూ తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయురాలు పొదిలి పద్మకు దరఖాస్తు అందజేసి ప్రవేశం పొందారు. ఒకటి నుండి 5వ తరగతి వరకు కూడా తాను పని చేస్తున్న పాఠశాలలోనే చదివించి ఆరవ తరగతిలో జడ్.పి.హెచ్.ఎస్ బాలికల పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించారు. నేడు ఆర్థిక స్థితి బాగాలేని తల్లిదండ్రులు సైతం ప్రైవేటు మోజులో డబ్బులు చెల్లించి పట్టణాల్లో చదివిస్తున్న తరుణంలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు అనిత మాట్లాడుతూ 33 సంవత్సరాలు క్రితం ఇదే పాఠశాలలో చదివిన తాను తమ కూతుర్ని కూడా ఈ పాఠశాలలో చదివించటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

## బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

### జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఎ ప్రమీల

**ఖమ్మం, జూన్ 18 (జనంసాక్షి)**
ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఎ ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాపితంగా ప్రతి ఏడాది బాలల ప్రతిభను గుర్తించడం ద్వారా వారిని ప్రోత్సహించే క్రమంలో కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారాలను అందిస్తోందని ఈ సందర్భంగా ఉదహరించారు. ధైర్యం, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు మరియు సంస్కృతి, విజ్ఞానం సాంకేతికత ఇలా 6 రంగాలలో ఇప్పటికే ప్రతిభ ఉన్న బాల బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. వచ్చే జులై 31వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవలన్నారు. 5 సంవత్సరాలు పైబడి, 18 సంవత్సరాలు మించని బాలలు దరఖాస్తుకు అర్హులన్నారు. దరఖాస్తులు http://award.gov.in ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించడం జరుగుతుందని,ఆన్లైన్ చేసిన ఒక కాపీని కొత్త కలెక్టరేట్ మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ 2వ అంతస్తు రూమ్ నెనీ ఎస్ 32న సమర్పిచాలి అని సంక్షేమ శాఖ అధికారిణి తెలిపారు.

## ప్రజల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా పారిశుధ్య నివారణ కోసం స్పెషల్ డ్రైవ్

**కల్లూరుజూన్ 18(జనం సాక్షి)**
ప్రజల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా పారిశుధ్య నివారణ కార్యక్రమాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక కల్లూరు పట్టణ పరిధిలోని 17వ వార్డుతో పాటు పలు వీధుల్లో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన పరిసరాల పరిశుభ్రత డ్రైనేజీ కాలువల పూడికతీతల పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ నగర్ కాలనీతో పాటు పలు వీధులలో నివాసం ఉండే ప్రజలు, గతంలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు సోకి అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా, కొంతమంది డెంగ్యూ వ్యాధితో ప్రాణాలు కోల్పోయారు. ఆ ప్రాంతాలను గుర్తించి స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్టు తెలిపారు. ప్రత్యేక పారిశుధ్య నివారణలో భాగంగా సైడ్ డ్రైన్ లో పూడిక తీయడం, చెత్తాచెదారం తొలగించటం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటం వంటి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రజలు తమఇంటిపరిసరాలను చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకుంటే దోమలను నివారించవచ్చునని అన్నారు. వర్షాకాలంలో సీజన్ వ్యాధులు రాకుండా



ముందస్తు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికుల చేత పలు వీధుల్లోని డ్రైనేజీ కాలవల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, రహదారుల వెంట కంపచెట్లను పిచ్చి మొక్కలను తొలగించటం, పరిసరాల పరిశుభ్రత, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచడం, దోమల వ్యాప్తి నివారణకు యాంటీ లార్వాను స్ప్రే చేయడం, వంటి పనులు చేపట్టారు. డెంగ్యూ,మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధుల నివారణకు మున్సిపాలిటీ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్ లు కనపర్తి శ్యామల రాజశేఖర్, ఉబ్బన రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్, మున్సిపల్ సిబ్బంది, శానిటేషన్ కార్మికులు, వార్డు సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పినపాక ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు పదోన్నతి ఎంపీడీవోగా ప్రమోషన్

**పినపాక, జూన్ 18 (జనంసాక్షి):**



పినపాక ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. పది సంవత్సరాలకు పైగా పినపాక మండలంలో సేవలందించిన ఆయన క్రమశిక్షణ, పనితీరు, ప్రజల పట్ల సానుకూల వైఖరితో మంచి అధికారిగా గుర్తింపు పొందారు. కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్న సమయంలోనూ అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పరిపాలనా వ్యవహారాలను ముందుకు నడిపించారు. మండల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషించారు. పదోన్నతి పొందిన శ్రీనివాసరావుకు సహోద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు అభినందనలు తెలియజేస్తూ ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.



## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

### నిత్యాన్నదానంకు రూ.లక్ష విరాళం.,

**భద్రాచలం జూన్ 18 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:- భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు. అలాగే దేవస్థానం నిత్యాన్నదాన పథకంకు రూ.లక్ష విరాళంను హైదరాబాద్‌కు చెందిన పూలగుర్తి పద్మావతి అందజేశారు.

## మాదకద్రవ్యాల రహిత, బాలికలకు సురక్షితమైన సమాజ నిర్మాణానికి అందరూ బాధ్యత వహించాలి : జిల్లా సంక్షేమ అధికారి ఎ. ప్రమీల

**ఖమ్మం, జూన్ 18 (జనంసాక్షి)**



అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్ అభియాన్" వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఖమ్మం రైల్వే స్టేషన్‌లో అవగాహన సదస్సు, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎ. ప్రమీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాజిల్లా సంక్షేమ అధికారి ఎ. ప్రమీల మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల రహిత సమాజంతో పాటు బాలికలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం బేటీ బచావో ? బేటీ పడావో పథకం లక్ష్యాలను వివరించిన ఆమె, బాలికల విద్య, భద్రత, సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాల గురించి తెలియజేశారు. అలాగే మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం అందుబాటులో ఉన్న చైల్డ్ హెల్ప్‌లైన్?1098, మహిళా హెల్ప్‌లైన్?181, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్?112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్?1930, దివ్యాంగుల హెల్ప్‌లైన్?14567, నషా ముక్త్ భారత్ అభియాన్ హెల్ప్‌లైన్?14446 సేవలపై అవగాహన కల్పించారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్న ఆమె, మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్, ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్ గౌడ్, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, డీహెచ్‌ఈడబ్ల్యూ డీఎంసీ ఎస్.డి. సమ్రీన్, పి. ప్రమీల, ఎన్‌ఎంబీఏ కమ్యూనిటీ ఎడ్యుకేటర్లు మానస, ఆర్. వేణుగోపాల్, బిందు ప్రసాద్, ఎఫ్‌ఆర్‌వో సునీల్, చైల్డ్ హెల్ప్ డెస్క్ సిబ్బంది, షేర్ ఎన్‌జీఓ ప్రతినిధులు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసిలో మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ఖమ్మం కార్పొరేషన్ జూన్ 18 (జనం సాక్షి )**
తెలంగాణ ఆర్టీసీలో రీజనల్ మేనేజర్ స్థాయి అధికారి నుండి కండక్టర్ స్థాయి ఉద్యోగుల వరకు 4,500 మంది పైగా మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల సానుభూతితో వ్యవహరించాలని ప్రభుత్వానికి, యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన ఆర్టీసీ శ్రామిక మహిళా సదస్సు అనేక తీర్మానాలను ఆమోదించింది.
గురువారం ఉదయం ఖమ్మం లోని కొండబోలు వెంకయ్య చౌదరి మీటింగ్ హాల్ లో డి.సరిత అధ్యక్షతన ఏర్పాటైన రాష్ట్ర స్థాయి ఆర్టీసీ మహిళా సదస్సు లో ఎస్.రమాదేవి వక్తలను వేదిక మీదికి ఆహ్వానించారు. ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి ప్రారంభోపన్యాసం చేస్తూ పురుషులతో సమానంగా మహిళా ఉద్యోగులు ప్రజా రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తూ,కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉన్నారని శ్రామిక మహిళలుగా కుటుంబం లోనూ,విధి నిర్వహణలోనూ అనేక సమస్యలతో ఉన్న వారికి అండగా ఉండాల్సిన అవసరం అందరికీ ఉందన్నారు. లేబర్ కోడ్ ల రూపంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన లేబర్ కోడ్ లు తెలంగాణలో అమలైతే మహిళలు రాత్రి సమయంలో కూడా పనిచేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని అందుకని లేబర్ కోడ్ లను వ్యతిరేకించే పోరాటంలో మహిళలు ముందు భాగంలో నిలవాలని పిలుపునిచ్చారు. మహిళా సదస్సు జయప్రదం కావాలని,ఆర్టీసీ శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ సదస్సులో చర్చించాలని పరిష్కారంకోసం తీర్మానాలు చేయాలని ఆకాంక్షించారు ఆర్టీసీ శ్రామిక మహిళ రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ జె.పద్మావతి సదస్సులో నోట్ ప్రవేశ పెడుతూ ఆర్టీసీలో మహిళా ఉద్యోగులు పురుషులతో సమానంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, మహిళా సమస్యలను ప్రభుత్వం,యాజమాన్యం పరిష్కరించాలని సమస్యల పరిష్కారం కోసం ప్రతిపాదిస్తూ, మహిళా కండక్టర్లకు ప్రతి బస్టాండ్ లో ప్రత్యేకంగా వాష్ రూమ్ లు ఏర్పాటు చేయాలని,వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులు వాడకుండా తగు చర్యలు తీసుకోవాలని,మహిళల కు ప్రకృతి సిద్ధమైన అవసరాలకు గాను నెలకు మూడు రోజుల ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని,మహిళా కండక్టర్లకు ప్రత్యేక డ్యూటీ చార్ట్ ఏర్పాటు చేయాలని, రాత్రి 8 గంటల లోపు డ్యూటీ పూర్తయ్యే విధంగా డ్యూటీలను కేటాయించాలని,రాత్రి 8 గంటల తర్వాత బస్సు ఫెయిల్ అయితే మిగిలిన సర్వీస్ ను రద్దుచేసి మహిళా కండక్టర్ క్యాష్ రెమిట్ చేయుటకై తగు ఆదేశాలు జారీ చేయాలని,తనిఖీ అధికారుల్లో కొందరు ఉద్దేశపూర్వకంగా మహిళా కండక్టర్ పై చార్జిమెమోలు రాసి వేధింపులకు పాల్పడుతున్నారని,అటువంటి వాటిపై తగిన చర్యలు తీసుకొని మహిళా కండక్టర్లకు రక్షణ కల్పించాలని,ప్రతి డిపో,రీజియన్,జోనల్,హెడ్ ఆఫీస్ కేంద్రాలలో "లైంగిక వేధింపుల నిరోధక కమిటీ" ఏర్పాటు చేయాలని,సర్కులర్ లో పేర్కొన్న విధంగా సంస్థేతర మహిళలను కమిటీలో నియమించాలని,లైంగిక వేధింపులపై ఆ కమిటీ ఇచ్చే నివేదికపై తగు చర్యలు తీసుకోవాలని,ఆర్టీసీ శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ గా జె.పద్మావతి తో పాటు పదిహేను మందితో నూతన రాష్ట్ర సమన్వయ




కమిటీ ని సదస్సు ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.
ఖమ్మం రీజియన్ ఆర్టీసీ శ్రామిక మహిళ కన్వీనర్ గా డి.సరిత తో పాటు తొమ్మిది మందితో ఖమ్మం రీజియన్ నూతన కన్వీనింగ్ కమిటీ ని సదస్సు ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు గుండు మాధవరావు,పిట్టల సుధాకర్ నాయకులు హెచ్చు బసవయ్య,పగిళ్లపల్లి నరసింహారావు, తోకల బాబు,ఓరుగంటి రాంబాబు, జి.బాబు, సురేష్, రామలక్ష్మి,పర్వీనా,సైదమ్మ,నూర్జహాన్,పద్మా,రమాదేవి,సుధారాణి,విజయలక్ష్మి,మల్లికాంబ,ఎం.డి.ఎం బేగం. సీతమ్మ, రమా,లక్ష్మి,భాగ్యలక్ష్మి,జ్యోతి,మంజుల,శిరీష రాణి, మల్లికాంబ,లక్ష్మీ భవాని తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 28 న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..

**సీనియారిటీ ఆధారంగా ఎ ఎన్ ఏం సబ్ సెంటర్ల కేటాయింపుకు కౌన్సిలింగ్ ..**

**డాక్టర్ తుకరామ్ రాథోడ్, జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..**

**మణుగూరు, జూన్ 18 (జనంసాక్షి):** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణ, డెంగ్యూ, మలేరియా నియంత్రణ చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి డా. తుకారామ్ రాథోడ్ అన్నారు. శుక్రవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్లో పనిచేసే సిబ్బందికి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో ఎ ఎన్ ఎం ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉండి తల్లి?శిశు ఆరోగ్య సేవలు, గర్భిణీల నమోదు, క్రమానుసార ఏ ఎన్ సి పరీక్షలు, అధిక ప్రమాద గర్భిణీల గుర్తింపు, సాధారణ ప్రసవాల ప్రోత్సాహం, ప్రసవానంతర సేవలు, నవజాత శిశు సంరక్షణ, పూర్తి స్థాయి టీకాల కార్యక్రమం, కుటుంబ నియంత్రణ సేవలు, కౌమార బాలికల ఆరోగ్య సేవలు, రక్తహీనత నివారణ, సికిల్ సెల్ అనీమియా స్క్రీనింగ్, అసంక్రమిత వ్యాధుల మధుమేహం స్క్రీనింగ్ వంటి సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కౌన్సిలింగ్ ద్వారా సబ్ సెంటర్లు కేటాయించబడిన వారు వారి విధులను సక్రమంగా నిర్వహించాలని విధులలో అలసత్వం, నిర్లక్ష్యం, వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు

**సీజనల్ వ్యాధులపై చర్యలు:**

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్లో పనిచేసే సిబ్బంది అందుబాటులో ఉండాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణ, డెంగ్యూ, మలేరియా నియంత్రణ చర్యలు, ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం, యాంటీ లార్వల్ చర్యలు, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత తాగునీరు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రతి ఏ ఎన్ ఎం పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి, గర్భిణీలు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు, వృద్ధులు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన ఆరోగ్య సేవలు అందించడంతో పాటు ప్రజలకు ఆరోగ్య విద్య, పోషకాహారం, యోగా, వ్యాయామం, వ్యక్తిగత పరిశుభ్రత, జీవనశైలి వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజారోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి కుటుంబానికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా అంకితభావంతో పనిచేయాలని మహిళ ఆరోగ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అదేవిధంగా జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ఇంటింటి సర్వే నిర్వహించి పూర్తి స్థాయిలో కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆదేశించారు. పల్స్ పోలియోపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.





**ఏ ఎన్ ఎం లు బదిలీలు:**

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 38 ప్రకారం చేపట్టిన సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించబడిన 54 మంది మహిళ ఆరోగ్య కార్యకర్తలకు పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించి ఆయా ఆరోగ్య ఉప కేంద్రాలు కేటాయించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారామ్ రాథోడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్, శ్రీధర్, కళ్యాణి, మోహన్, శ్రీనివాస్, జానకి, ఉమాదేవి ఉద్యోగ సంఘ బాధ్యులు మరియు కార్యాలయ సిబ్బంది , పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# పాలిటెక్నికల్ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**మధిర, జూన్ 18 (జనంసాక్షి):** పాలిటెక్నికల్ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మధిర ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ కే సాంబయ్య తెలిపారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సంవత్సరం మధిర పాలిటెక్నికల్ కళాశాలకు సిఎస్సి మంజూరు అయిందన్నారు. అంతేకాకుండా పరిశ్రమలకు కావలసిన సిలబస్ను ఈ ఏడాది నుండి రాష్ట్ర సాంకేతిక శాఖ అమలు చేస్తుందన్నారు. విద్యార్థులు మధిర ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో తొలి విడతలో 90 శాతం మంది ఆన్లైన్ ద్వారా సీటును పొందారన్నారు. మధిర పాలిటెక్నికల్ కళాశాల పక్కనే విద్యార్థులకు ఉచిత హాస్టల్ ఉందని ఆయన తెలిపారు. పర్మినెంట్ లెక్చరర్స్ తో విద్యార్థులకు మంచి బోధనతోపాటు ప్రాక్టికల్స్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.



# శాంతి భద్రతలకు విగాదం కల్పిస్తే కఠిన చర్యలు

**అక్రమ ఇసుక రవాణా పై ఉక్కుపాదం**

**విలేకరుల సమావేశంలో మధిర రూరల్ ఎస్సై విశ్వతేజ**

**మధిర, జూన్ 18 (జనంసాక్షి):** శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై అమర్ల పూడి విశ్వతేజ అన్నారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేరస్థులకు ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండదని కేవలం పౌరులకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉంటుందని ఆయన తెలిపారు. ఇసుక అక్రమ రమాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కల్పించినా, కోడిపందాలు, జూదం నిర్వహించినా తనకు సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలను కాపాడే విషయంలో ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.




# నాగలి పట్టి అరక దున్నుతు సందడి చేసిన ఎమ్మెల్యే మందుల సామేలు

**తుంగతుర్తి జూన్ 18 (జనంసాక్షి)** తుంగతుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్యక్రమంలో పాల్గొని వెళుతుండగా మండల కేంద్రంలోని వెలుగుపల్లి రోడ్డులో మృగశిర ఏరువాక సందర్భంగా విత్తనాలు వేసే రైతులతో కలిసి ఎమ్మెల్యే సామేలు గురువారం అరక దున్నారు. రైతు పట్ల తనకున్న మమకారాన్ని చాటుకుంటూ స్వయంగా పొలంలోకి ఎద్దులతో అరక దున్ని సందడి చేశారు. వ్యవసాయం అంటే తనకు ఎంతో ఇష్ట మని, రైతులు విత్తనాలు వేసే సమయం లో జాగ్రత్తగా ఉండాలని, నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు అన్నారు.



# దన్నుగోడ పనులను పరిశీలించిన అధికారులు

**చంద్రుగొండ, జూన్ 18 (జనం సాక్షి):** చంద్రుగొండ మండల పరిధిలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన దన్నుగోడ పనులను ఐబి అధికారులు గురువారం పరిశీలించారు. ఐబి డీఈ సుబ్రహ్మణ్యం, నాణ్యత విభాగం అధికారి బి. రమేష్‌బాబు, ఏఈ నరసింహారావు పనుల పురోగతిని పరిశీలించి గుత్తేదారులకు పలు సూచనలు చేశారు.పనులు నత్తనడకన కొనసాగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేసిన అధికారులు, గుత్తేదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు.



# ఓ పక్కనార్లుపోస్తూ ..

**మరోపక్క పత్తి విత్తనాలునాటుతూ -రైతులు బిజీ బిజీ**

**వేసవిలోరైతులు పెట్టిన అగ్గితో దడ పుట్టించిన వరిపొలాలు**

**తొలకరి ప్రారంభంతో దున్నిన పొలాల్లో గుమగుమ లాడే మట్టి వాసన**



**పెనుబల్లి, జూన్ 18(జనంసాక్షి)** జూన్ మొదటివారంతొలకరి ప్రారంభంతో రైతులహడావుడి ప్రారంభమవుతుంది. వేసంగి పంట పూర్తయి పంట్ట పొలాల్లో ఉన్న వ్యర్థాలను కాల్చడం. తొలకరి వానతో నారు పోసేందుకు నారు మడినిదున్ని సిద్ధం చేసి, మిగిలిన వరి మళ్లను పొడిదుక్కులు దున్నడంతో తొలకరి కమ్మని మట్టివాసనతో ప్రారంభమవుతుంది. మరోపక్క తొలకరి వర్షాలకు మెరకచేలను పొడి దుక్కులు దున్ని సిద్ధం చేసి పత్తి విత్తనాలు నాటుతూ రైతులు బిజీ బిజీగా ఉన్నారు. మామిడి రైతాంగం కూడా మామిడి తోటలను దుక్కులు దున్నిమామిడి చెట్లకు ఎరువులు వేసేపనుల్లో నిగ్నమై ఉన్నారు. పెనుబల్లి మండలంలోని లనీకాసాగర్ ప్రాజెక్టుఆయకట్టు గ్రామాలు, సాగర్ కాలువ కింద గ్రామాలు. వ్యవసాయ బోర్లు కింద సాగు చేసే రైతులు ముందు జాతగా నార్లు పోయడం జరిగింది. పెనుబల్లి రాథోని చెరువు ఆయకట్టు రైతులు నారుమళ్లు దున్ని నార్లుపోసేందుకు సిద్ధంగా ఉన్నారు. రాతోని చెరువులో సాగునీరు సమృద్ధిగా లేకపోవడంతో రైతులు నార్లు పోసేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఎలినినో ప్రభావంతో ఈ ఏడాది వరిసాగుకి సమృద్ధిగా వర్షాలు పడతాయో లేదో అని రైతులు అయోమయంలో ఉన్నారు.

**సందెట్లో సడేమియా అన్నట్లు యూరియా యాప్**

దుక్కులు దున్నడం విత్తనాలు చల్లడం, నాటడం హడావిడిలో ఉన్న రైతులకు యూరియా యాప్ లో మండలానికి సంబంధించిన స్టాక్ చూపిస్తుంది అనే సమాచారం రాగానే రైతులు ఉన్నపళంగా ఉరుకులు పరుగులు షురూ. పట్టాదార్ పాస్ పుస్తకం ఉండి సెల్ ఫోన్ ఉండి బుకింగ్ వచ్చిన రైతులసంగతి సరే. పట్టాదార్ పాస్ పుస్తకం లేని సెల్ ఫోన్ లేని రైతులు పరిస్థితి యూరియా కట్ట కోసం తప్పని తిప్పలు.





## రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

### జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్

**కొండమల్లేపల్లి, జూన్ 18 (జనంసాక్షి):**
రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే ఎరువుల దుకాణాల డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెర్టిలైజర్ విత్తనాల డీలర్లకు ప్రభుత్వం సూచించిన వరి వంగడాలను మాత్రమే విక్రయించాలని అలాగే నాణ్యమైన పత్తి విత్తనాలను మాత్రమే రైతులకు అందించాలని సూచించారు. ఈ సీజన్‌లో ప్రభుత్వం విడుదల చేసిన వరి రకాలను మాత్రమే రైతులు సాగు చేయాలని తెలిపారు. వరి రకాలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం బోనస్ కూడా అందజేస్తుందని గుర్తు చేశారు. యూరియా విక్రయాల కోసం యాప్ ఆధారిత బుకింగ్ ప్రక్రియ మరో రెండుమూడు రోజుల్లో ప్రారంభమవుతుందని తెలిపారు. ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే విక్రయాలు జరపాలన్నారు.అధిక ధరలకు అమ్మితే ఎరువుల దుకాణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలో భాగంగా స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు పరిశీలించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి అని చెప్పారు. రైతులకు ఎరువులు అమ్మిన వెంటనే ఈపాస్ తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీలర్లు విత్తనాలను ఎమ్మార్పీకు మించి అమ్మితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఎరువులు విక్రయించే డీలర్లు ఈపాస్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలని సూచించారు. ఎరువుల మందులు వ్యవసాయ అధికారులు సిఫారసు చేసినవే కొనుగోలు చేయాలని సూచించారు. ఫర్టిలైజర్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని, డీలర్లు ఎరువుల దుకాణాలలో ఎలాంటి అవకతవకులకు పాల్పడిన చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. వారివెంట నకిరేకల్ ఏ.డి.ఏ.
విజయేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి జానకిరాములు, ఏఈఓలు, డీలర్లు తదితరులు ఉన్నారు.

## నూతనకల్ మండలంలో నకిలీ పత్తి విత్తనాల కలకలం

### స్థానిక పోలీసులు స్వాధీనం ఒక వ్యక్తి అరెస్ట్

నూతనకల్ జూన్ 18 (జనం సాక్షి)
పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా అనుమానస్పదంగా ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న ఓ వ్యక్తి నుండి నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు నూతనకల్ ఎస్సై నాగరాజు తెలిపారు గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నూతనకల్ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారుల పెద్దనెమిలి ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా గుండేపూడి గ్రామం, మరిపెడ మండలం, మహబూబాబాద్ జిల్లా నివాసి బోడపట్ల యాకస్వామి (32) అనే వ్యక్తిని టీఎస్-26-5651 హీరో గ్లామర్ మోటార్ సైకిల్ పై అనుమానాస్పదంగా తరలిస్తున్న పత్తి విత్తనాలతో పట్టుకున్నామన్నారు, అతని వద్ద నుండి "అరుణోదయ" లేబుల్ కలిగిన 65 ప్యాకెట్ల పత్తి విత్తనాలు (ఒక్కోటి సుమారు 450 గ్రాములు) స్వాధీనం చేసుకున్నామన్నారు, విత్తనాల విక్రయానికి వినియోగించినట్లు భావిస్తున్న ఒక మొబైల్ ఫోన్ మరియు మోటార్ సైకిల్ మరియు ఒక టాటా ఏసీ వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకొని విత్తనాలను తదుపరి పరీక్షల నిమిత్తం సంబంధిత అధికారులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న నందిగామ కి చెందిన రాంబాబు అనే ఇతర వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై తెలిపారు.



## మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్ష: రూ. 26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్

**చండూరు, జూన్ 18 (జనంసాక్షి)**
చండూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఔట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల సాధనకై గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.?కనీస వేతనం: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ నెలకు రూ. 26,000 కనీస వేతనం అమలు చేయాలి.?గృహ వసతి: అర్హులైన కార్మికులందరికీ ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, గూడు కల్పించాలి. ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి: సిఐటియు ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ధనంజయ మాట్లాడుతూ, రాత్రింబవళ్లు పట్టణ పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం కనీస మానవత్వాన్ని ప్రదర్శించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికులకు ఇచ్చే అరకొర జీతాలతో ఇండ్ల అద్దెలు కట్టడమే కష్టంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వడంతో పాటు, వారికి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించి ఆదుకోవాలి."ధనంజయ, సిఐటియు మండల కార్యదర్శి తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని ఆపేది లేదని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ దీక్షలో మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా బుసిరెడ్డి పాండురంగారెడ్డి జన్మదిన వేడుకలు

### ○విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ ○సొంత నిధులతో పంపిణీ చేసిన మాజీ ఉపసర్పంచ్ కుంభం ప్రశాంత్ రెడ్డి ○గుర్రంపోడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సంబరాలు ○పిల్లలందరికీ త్వరలోనే పాదరక్షలు, నడుము పట్టీలు అందిస్తామని హామీ

**గుర్రంపోడు: జూన్ 18 (జనంసాక్షి):**
నాగార్జునసాగర్ బుసిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు బుసిరెడ్డి పాండురంగారెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ ఉపసర్పంచ్ కుంభం ప్రశాంత్ రెడ్డి తన సొంత ఖర్చులతో ఉచితంగా పుస్తకాలు, కలములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తమకు పాదరక్షలు, నడుము పట్టీలు, మెడ పట్టీలు (టై) కావాలని ప్రశాంత్ రెడ్డిని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. వెంటనే ఫౌండేషన్ యాజమాన్యంతో మాట్లాడి, త్వరలోనే విద్యార్థులందరికీ పాదరక్షలు, నడుము పట్టీలు, మెడ పట్టీలు అందిస్తానని మాట ఇచ్చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి, ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను అభ్యసించాలని సూచించారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న వసతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని, ఉన్నత ఆశయాలతో చదివి తమ గమ్యాలను చేరుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అక్కెనపల్లి నరసింహ, కె. నాగలక్ష్మి, పి. శ్రీధర్ రెడ్డి, మాజీ మండల విద్యాధికారి ముత్యం రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కుంభం ప్రశాంత్ రెడ్డి, స్థానిక నాయకులు కట్ట యాదయ్య, బైరి మల్లేష్, భూషిపాక మురళి, కట్ట హరికృష్ణ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.






## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సందీప్‌కు ఎమ్మెల్యే మందుల సామేలు నివాళి

**మోత్కూరు జూన్ 18 (జనంసాక్షి)**
దతప్పగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఎలుగు యాదయ్య ? పార్వతమ్మ దంపతుల కుమారుడు సందీప్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం పట్ల తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సందీప్ పార్థివ దేహానికి ఎమ్మెల్యే మందుల సామేలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద ఘటన కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు.అలాగే సందీప్ అంతిమయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సందీప్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా పున్న జగన్ మోహన్

**రామన్నపేట, జూన్ 18 (జనంసాక్షి):** రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పున్న జగన్ మోహన్‌ను నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఉత్తర్వులు జారీ చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య ఈ నియామకాన్ని ఆమోదించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. పార్టీని గ్రామీణ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నూతన అధ్యక్షుడు పున్న జగన్ మోహన్‌కు పార్టీ నాయకత్వం సూచించింది. ఈ నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డికి, జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.





## రైతులు అధైర్య పడొద్దు వరి ధాన్యం చివరి గింజ వరకు కొంటాం

**- మండల స్పెషల్ ఆఫీసర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేసి ప్రమీల**

**సంస్థాన్ నారాయణపురం. జూన్ 18 (జనంసాక్షి):** యాద్రాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సర్) ప్రక్రియపై జరుగుతున్న పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టాక మొదటిసారి ఆమె మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, మోడల్ స్కూల్ కేజీబీవీలను సందర్శించారు. రైతుల వరి ధాన్యం ప్రతి చివరి గింజ వరకు అత్యంత వేగంగా కొనుగోలు చేస్తామని, రైతులకు భరోసా ఇచ్చారు. మోడల్ పాఠశాలలలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లను ఆమె పరిశీలించి ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్కూలు ప్రారంభమై నాలుగు రోజులు అవుతుండడంతో విద్యార్థుల హాజరు సంఖ్య తక్కువగా ఉండడం గమనించారు. తదనంతరం కేజీబీవీలో కూడా విద్యార్థుల హాజరు శాతం తక్కువగానే నమోదు కావడంతో మరోసారి విద్యార్థులు పూర్తిగా హాజరు అయిన తర్వాత తరగతులు నిర్వహిస్తానని తెలిపారు. అందుబాటులో ఉన్న విద్యార్థులతో మాట్లాడుతూ మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట నాయబ్ తాసిల్దార్ మమత ,స్థానిక మండల విద్యాధికారి గోలి శ్రీనివాసులు, స్థానిక ఆర్ ఐ జుబేరుద్దీన్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శివరంజని తదితరులు ఉన్నారు.

## గ్రామ పంచాయతీ నిర్లక్ష్యంపై బీజేపీ ఆగ్రహం

**ప్రజా సమస్యల పరిష్కారానికి రంగంలోకి దిగిన బీజేపీ నాయకులు**



**చింతపల్లి, జూన్ 18(జనంసాక్షి)** చింతపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు స్వయంగా రంగంలోకి దిగారు. గ్రామంలోని మురుగు కాలువలు పూడికతో నిండిపోవడంతో దుర్వాసన వ్యాపించి, దోమలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గత కొంతకాలంగా గ్రామంలోని డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి, చిన్నపిల్లలు, వృద్ధులు సహా స్థానిక ప్రజలు అంటువ్యాధుల బారిన పడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బీజేపీ నాయకులు గురువారం గ్రామంలోని 3వ వార్డులో పూడికతీత కార్యక్రమాన్ని చేపట్టారు. మోరీల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టి తదితర చెత్తను తొలగించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామ పంచాయతీ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గ్రామంలో పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.. ఈకార్యక్రమంలో బీజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివర్ల రమేష్ యాదవ్,3 వార్డ్ మెంబర్ సోమరాజు మౌనిక ప్రదీప్, బూత్ అధ్యక్షులు గజ్జె అభినవ్ ,గంగాలి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



## సర్ ను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా అడిషనల్ కలెక్టర్ హరి సింగ్**

**తుంగతుర్తి జూన్ 18 (జనంసాక్షి)** అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడం నకిలీ ఓట్లను తొలగించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ పకడ్బందీగా నిర్వహిస్తుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ హరి సింగ్ అన్నారు, గురువారం మండల కేంద్రంలో బి ఎల్ ఏ లకు సర్ కు సంబంధించిన మెటీరియల్ పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈనెల 25 నుండి జరగనున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ను నెలరోజులపాటు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ప్రతి ఒక్క బీఎల్ఏ ఇంటింటికి వెళ్లి ఓటు హక్కు కలిగిన వారి వివరాలను నమోదు చేయాలని దిశా నిర్దేశం చేశారు 2002 నాటికి ఓటరుగా నమోదుఅయి ప్రస్తుతం ఉన్న వారి వివరాలను ధ్రువీకరిస్తారని ఒకవేళ 2002 నాటికి ఓటరు జాబితాలో పేరు లేకపోతే వారి తల్లి లేదా తండ్రి వివరాలతో మ్యాపింగ్ చేయాలని అన్నారు, ఇందులో ఓటరు పేరు తండ్రి పేరు లేదా ఇతర వివరాలు తప్పుగా నమోదయి ఉంటే సరిచేయాలని అన్నారు చనిపోయిన వారి పేర్లను శాశ్వతంగా తొలగించాలన్నారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉంటే వారికి అధికారులు నోటీసు జారీ చేస్తారని అన్నారు, అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు, ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చినవారు తమ అడ్రస్ మార్చుకోవడానికి ఫామ్8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దయానందం, బి ఎల్ ఓ లు ఎన్యూమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## హలో ఉప సర్పంచ్ చలో హైదరాబాద్ గోడపత్రిక ఆవిష్కరణ

**యాదాద్రి, కరస్పాండెంట్ జూన్ 18 (జనంసాక్షి)** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం రోజున హలో ఉప సర్పంచ్ చలో హైదరాబాద్ కార్యక్రమం గోడపత్రికను జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 25న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు ఉప సర్పంచ్‌ల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప సర్పంచ్‌లకు తగిన అధికారాలు, గౌరవ వేతనం, సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమైనప్పటికీ, వారికి తగిన గుర్తింపు, అధికారాలు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉప సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌లందరు ఈ నెల 25న ఇందిరాపార్క్‌లో జరిగే ధర్నాకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురగంటి శ్రీధర్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాసాల లింగస్వామి యాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు మజ్జిగ నరేష్, చిన్నం బాలరాజు, మండల ఫోరం అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, సత్యం, కిషోర్ వివిధ గ్రామాల ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**జనంసాక్షి, మిర్యాలగూడ :** ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడీ అరికట్టాలని మిర్యాలగూడ లో బీసీ, ఎస్సీ ,ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో విచ్చలవిడిగా విద్యా వ్యాపారం కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారు అడ్మిషన్ ఫీజు , స్కూల్ ఫీజు, పుస్తకాలు, పేరిట వేలకు వేల రూపాయలు వసూళ్లు చేస్తున్న కూడా ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు ఎందుకు కట్టడి చేయడం లేదో అర్థం కాని పరిస్థితి ఉంది అన్నారు ప్రభుత్వం పేదల పక్షాన ఆలోచన చేసి ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తే ఎంతోమంది నిరుపేదలు మధ్యతరగతి ప్రజలు పిల్లలు ఉన్నత చదువులు చదువుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు స్పందించట్లేదు మిర్యాలగూడలో అత్యధికంగా విద్యాసంస్థలు ఏర్పాటు చేసుకొని వారి ఇష్టానుసారంగా ఫీజులు నిర్వహించుకొని విద్యా వ్యాపారమే లక్ష్యంగా యాజమాన్యాలు డబ్బులు వసూళ్లు చేస్తుంటే కట్టడి చేయాల్సినటువంటి ప్రజాప్రతినిధులు ,విద్యాశాఖ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు .పేద ప్రజలు మధ్యతరగతి ప్రజలు చదువుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఉండాలి కానీ పేదవానికి విద్య దక్కకుండా చేస్తున్న ఈ ప్రైవేటు యాజమాన్యాలకు మద్దతుగా ఉండకూడదని ఆయన అన్నారు మిర్యాలగూడలో ఫీజులు కట్టడి చేయకుంటే మాత్రం విద్యాశాఖ అధికారుల కార్యాలయాలు ప్రజాప్రతినిధుల కార్యాలయాలు ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో.. మాల మహానాడు విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్కా నాగేశ్వరరావు, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లావురి రవీందర్ నాయక్, బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ సిద్ధం రాజు, లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సైదా నాయక్, బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు పట్టేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రతి రైతుకు ఎరువులు విత్తనాలు అందించాలి

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**కొండమల్లేపల్లి, జూన్ 18 (జనంసాక్షి):**
రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ నల్గొండ జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ కు సూచించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పంట వేసినప్పటి నుంచే పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. వర్షాలు, వ్యవసాయ సీజన్, తీసుకోవలసిన చర్యలపై ఎమ్మెల్యే జిల్లా వ్యవసాయ అధికారికి సూచించారు. విత్తనాల పంపిణీ మొదలు పంట వేసినప్పటి నుంచే అన్ని గ్రామాల్లో రైతులు, పంటల వివరాల నమోదు, రికార్డులు, పంట ఉత్పత్తుల అంచనాలు, ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు పరిశీలించలన్నారు.క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంతో పాటు ఈ ప్రక్రియకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుందని ఏ రైతు ఏ పంట వేశారు, ఏ గ్రామంలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే వివరాలు కచ్చితంగా క్షేత్ర స్థాయి పరిశీలనతో నమోదు చేయాలని చెప్పారు. కనీస మద్దతు ధరలు, కేంద్రం నిర్దేశించిన కోటాలను అనుసరించి దేవరకొండ నియోజకవర్గంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో ఏడురకాల సన్న వడ్ల విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని రైతు వేదికల్లోనే సన్న వడ్ల విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. సన్న వడ్లు పండించే రైతుల పూర్తి డేటా సేకరించి ధాన్యం దిగుబడిపై జిల్లా వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలి అని అన్నారు. వారివెంట నల్గొండ ఏఓ శ్రీనివాస్, నకిరేకల్ ఏడీఏ విజయేం దర్ రెడ్డి, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు తదితరులు ఉన్నారు.

## బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన సదస్సు

**చింతపల్లి, జూన్ 18(జనంసాక్షి)**



ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై చింతపల్లి మండలంలోని బూత్ స్థాయి అధికారులకు గురువారం మండల పరిషత్ కార్యాలయం,లోఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు దేవరకొండ గౌరవ రాజస్వ మండలాధికారి పి. పద్మప్రియ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. ఓటరు జాబితాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా చింతపల్లి తహశీల్దార్ ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. శిక్షణ కార్యక్రమంలో ఏఎల్ఎంటీలు పి. గోవర్ధన్రావు, వి. రమేశ్,మండల ఎన్నికల సూపర్వైజర్లు , బూత్ అధికారులు పాల్గొన్నారు.





## మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి

### సీఐటీయూ నాయకుడు మెంట ఎల్లయ్య

**మోత్కూర్ జూన్ 18 (జనంసాక్షి)**
మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, రెండో పీఆర్సీలో కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మెంట ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోత్కూర్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన రిలే నిరాహార దీక్షల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, 2025 జనవరి నుంచి 2026 మే వరకు కార్మికుల వేతనాల నుంచి మినహాయించిన పీఎఫ్, ఈఎస్ఐ నిధులను వెంటనే సంబంధిత ఖాతాల్లో జమ చేయాలని కోరారు.విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, వర్షాకాలంలో సబ్బులు, కొబ్బరి నూనె, రెయిన్కోట్లు, మెడికల్ కిట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా కొత్త సిబ్బందిని నియమించాలని, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో మున్సిపల్ కార్మికులకు ప్రాధాన్యత కల్పించాలని, ఈఎస్ఐ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని మెంట ఎల్లయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు డి. లింగమ్మ, కే. లక్ష్మి, ఎన్. అండాలు, డి. మల్లమ్మ, సీహెచ్. అరవింద్, కె. అవినాష్, కె. స్వామి, ఎం. బిక్షం, డి. అండాలు, టి. వెంకన్న, ఎం. సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించాలి

### -టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్

**సూర్యాపేట (జనంసాక్షి):**
రాష్ట్రంలో విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ డిమాండ్ చేశారు.గురువారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని విద్యా హక్కు చట్టం స్పష్టంగా పేర్కొంటుందని తెలిపారు.సంపన్నులు, నిరుపేదలనే తేడా లేకుండా అందరికీ నాణ్యమైన విద్య అందించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమని తెలిపారు.అనేక ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడం లేదని, దీంతో పేద విద్యార్థులు ఫీజుల భారం మోయలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సూర్యాపేటలో సుమారు 75 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నట్లు గుర్తించామని అన్నారు.పేద విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు చట్టబద్ధంగా లభించాల్సిన రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు.సూర్యాపేటలోని కొన్ని పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు తమ పార్టీ దృష్టికి వచ్చిందని, అలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.టీఆర్పీ విద్యార్థి విభాగం విద్యార్థుల తల్లిదండ్రులకు అందుబాటులో ఉండి, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తుందని తెలిపారు.అనంతరం వీవీ ఎన్ క్లేవ్ లో పార్క్ స్థలాన్ని పరిశీలించారు.బాధితులకు తమ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు.ఆక్రమణలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో టీఆర్పీ జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కొన్నె మంజుల, పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి నారాయణదాసు కవిత, విద్యార్థి విభాగం అధ్యక్షులు మామిడి శోభన్, జిల్లా యువజన అధ్యక్షులు కోలా కరుణాకర్, లింగాల సైదులు, సూపర్ సైదులు, నేలచర్ల మధు, దీపమల, రంప శ్రీదేవి, కుంభం వెంకన్న, మధు, రఘు, శేఖర్, విజయ్, గౌస్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.



## డీసీఎం కార్ ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలు

**వలిగొండ, జున్ 18( జనంసాక్షి)**



డీసీఎం కారు ఢీకొని ఇద్దరి యువకులకు గాయాలైన ఘటన మండలంలోని ముద్దాపురం సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం జలాల్పురం గ్రామం చెందిన బార్గం చిన్న, బొంగరకు చెందిన యాకూబ్ కలిసి కార్లు హైదరాబాద్కు వెళ్తున్నారు యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ముద్దాపురం స్టేషన్ సమీపంలో డీసీఎం కారు ఢీకొనగా ఈ ప్రమాదంలో భార్గవ్, యాకూబ్ బ్ కు తీవ్ర గాయాలయ్యాయి అంబులెన్స్ సిబ్బంది చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సిబ్బంది తెలిపారు.

## సీఎం ఇంటి ముట్టడి నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలపై ముందస్తు అరెస్టులు



**హాలియా జనంసాక్షి**
అక్రమ అరుసులతో ఉద్యమాన్ని ఆపలేరని బి ఆర్ ఎస్ ఉద్యమ నాయకులు బుర్ర వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం నాడు . ఫీజుల నియంత్రణ మరియు విద్యార్థుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా జరిగే సీఎం ఇంటి ముట్టడి నిరసనలు కారణంగా పోలీస్ రికార్డుల ప్రకారం పార్టీ నియోజక వర్గ కేంద్రం వద్ద నటిస్తున్న చర్యలలో భాగంగా బీఎఆర్ఎస్? నాయకులు మరియు ఉద్యమకారులైన హైదరాబాద్ కు తరలి వెళ్లకుండా ముందస్తు హాలియా పోలీస్ లు. అదు పులోకి తీసుకున్నారు , పోలీసుల అదుపులో వడ్డే సతీష్ రెడ్డి, సురభి రాంబాబు, షేక్ హుస్సేన్, రావులపాటి ఎల్లయ్యగారు అరెస్టు చేయబడ్డారు. అదనంగా బీఆర్ఎస్ నాయకులు పెరుమళ్ళ రాంబాబు, పగడోజు సైదాచారి, సీతారాల మహేష్, ధూపాటి మధుసూదన్ రాజు కూడా హస్తగతులైనట్లు అనుమానాలున్నట్టు తెలిసింది.

## వినియోగదారుల మన్ననలు పొందాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన హెయిర్ హౌజ్ బ్యూటి సెలూన్ ను ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వ్యాపార రంగంలో రాణించాలని అన్నారు.సూర్యాపేటకు చెందిన అజయ్ బ్యూటీ సెలూన్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని అన్నారు.యువత అభిరుచికి తగ్గట్లుగా సేవలను అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మోరిశెట్టి లక్షాది, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, ఫారుఖ్, బైరు వెంకన్న, రాచకొండ శ్రీనివాస్, కలకోట లక్ష్మయ్య, వంగవీటి రమేష్, యామా సంతోష్ , నిర్వాహకులు అజయ్, ఉదయ్, శ్రవణ్,యశ్ ముదిరాజ్,మురళి, సైదులు తదితరులు పాల్గొన్నారు.



# పదవులకు వన్నె తేవాలి

## - రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సాముల రాంరెడ్డి



**హుజూర్ నగర్, (జనంసాక్షి):** ఎంతో నమ్మకంతో ఉచిత న్యాయ సహాయ న్యాయవాదులు గా నియమింపబడిన న్యాయవాదులు కష్టించి నిజాయితీగా పనిచేసి ఆయా పదవులకు వన్నె తీసుకురావాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సాముల రాంరెడ్డి, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారపరాజు శ్రీనివాసరావు, ఉచిత న్యాయ సహాయ న్యాయవాదులైన కాల్వ శ్రీనివాసరావు, చనగాని మహేష్ లను కోరారు. వారి నియామకాన్ని పురస్కరించుకొని గురువారం రాంరెడ్డి, నారపురాజు శ్రీనివాసరావు లు స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గము, న్యాయవాదులతో కలిసి వారిని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు బలహీనులకు నిజాయితీగా ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం వల్ల పేదల న్యాయ వాదులుగా గుర్తింపును పొందటమే కాకుండా నైతిక ఆనందం మిగులుతుందన్నారు. న్యాయమూర్తుల సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తూ విధుల పట్ల క్రమశిక్షణతో వ్యవహరించాలని వారు కోరారు. ఆర్డీవో కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ కౌన్సిల్ గా నియమించబడిన స్థానిక మహిళా న్యాయవాది జుట్టుకొండ సంధ్య ను కూడా వారు సన్మానించి సత్కరించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన భూక్య నాగరాజు నాయక్, నర్సింగ్ సతీష్ లకు ధ్రువీకరణ పత్రాలు అందించి వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ లో నూతనంగా చేరిన మహిళా న్యాయవాది శృతికి వారు సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రమణారెడ్డి, రవికుమార్, నట్టే సత్యనారాయణ, అంబటి శ్రీనివాసరెడ్డి, చల్లా కృష్ణయ్య, ధూళిపాల శ్రీనివాసరావు, ఉప్పల గోపాల కృష్ణమూర్తి, చిట్టి పోతుల రమేష్, యాదగిరి, అంజయ్య, శ్రీను నాయక్, వీరు, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బుజ్జగింపుతో.. సొంత గూటికి గోళి..

◆పార్టీలో సుముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే

◆మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి ఇచ్చేందుకు సుముఖత తెలిపిన ఎమ్మెల్యే

◆అలక వీడిన గోళి నరేందర్ రెడ్డి



**బీబీనగర్ (జనంసాక్షి):** బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ గోళి నరేందర్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడంతో పార్టీకి పట్టణంలోని ఎదురు దెబ్బ తగిలినట్లు అయింది. నరేందర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరుతాడని, బీఆర్ఎస్ పార్టీ నేతలు సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం కొనసాగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్వయంగా నరేందర్ రెడ్డి కి ఫోన్ చేసి పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనాలని తనను కలిసేదుకు రావాలని చెప్పినప్పటికీ నరేందర్ రెడ్డి ఎమ్మెల్యేను కలవకుండా దూరంగా ఉంటూ వస్తున్నారు. త్వరలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో పట్టణంలోని రాజకీయ సమీకరణాలు తారుమారు అయ్యే అవకాశం ఉండడంతో ఎలాగైనా నరేందర్ రెడ్డిని తిరిగి కాంగ్రెస్ లోకి చేర్చుకోవాలని ఎమ్మెల్యే భావించినట్లు సమాచారం. నరేందర్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకునేందుకు పార్టీ నేతలు మంతనాలు జరుపుతుండడంతో ఎమ్మెల్యే కుంభం నేరుగా నరేందర్ రెడ్డిని కలిసి బుజ్జగించేందుకు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే స్వయంగా నరేందర్ రెడ్డి ఇంటికి స్థానిక నాయకులతో కలిసి వచ్చి నరేందర్ రెడ్డి తో గంట పాటు చర్చించారు. పార్టీ కోసం కష్టపడిన నరేందర్ రెడ్డి కి పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా అవకాశం కల్పిస్తానని లేదా త్వరలో పునర్విభజనలో భాగంగా జరిగే పిఎసిఎస్ నామినేటెడ్ పదవుల్లో పిఎసిఎస్ చైర్మన్ గా అవకాశం ఇస్తానని ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి కి హామీ ఇచ్చినట్లు సమాచారం. దీంతో నరేందర్ రెడ్డి తిరిగి కాంగ్రెస్ పార్టీలో పని చేసేందుకు సుముఖత తెలిపినట్లు ప్రచారం జరుగుతుంది.

# పేదింటి ఆత్మగౌరవానికి చిరునామా ఇందిరమ్మ ఇల్లు

## మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్

**మర్రిగూడ, జూన్ 18 (జనంసాక్షి)** పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం పేద కుటుంబాల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామదాసు శ్రీనివాస్ అన్నారు. మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మర్రిగూడ మండలంలోని యరగాండ్లపల్లి గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో రామదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆత్మీయ కానుకలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సొంతింటి కల నెరవేరిన లబ్ధిదారుల కళ్లలో కనిపించిన ఆనందం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సొంత గూడు కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల ద్వారా శాశ్వత పరిష్కారం చూపుతోందని పేర్కొన్నారు. మర్రిగూడ మండలంలో మొదటి విడతలో 540 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, యరగాండ్లపల్లి గ్రామానికి 39 ఇండ్లు కేటాయించారని తెలిపారు. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 2 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణలో ఏ పేద కుటుంబం కూడా ఇల్లు లేక ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం రెండో విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2 వేల ఇండ్ల చొప్పున మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు అందించి యరగాండ్లపల్లిని పూరిగుడిసెలు లేని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన లబ్ధిదారుల్లో కందుకూరి అలివేలు, కొత్త యాదయ్య, వనపర్తి ధనమ్మ, మహమ్మద్ అమీనా బేగం తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాడెం వెంకటయ్య, మార్కెట్ డైరెక్టర్ జమ్ముల వెంకటేష్, కాకుళవరం కరణ్ కుమార్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు కురంపల్లి జంగయ్య, బొమ్మిడి దర్శన్, సిలువేరు యాదయ్య, బచ్చునగోని వెంకన్న, మాజీ ఎంపీటీసీ అందుగుల ముత్యాలు, వళ్ళంల శ్రీనివాస్ (గాంధీ), గ్యార వెంకటేష్, అనిమల్ల లక్ష్మయ్య, గండు అగ్గిరాములు, మాడెం శంకర్, దండేటికార్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.







# పకడ్బందీగా స్పెషల్ ఇంటెన్సిప్ రివిజన్ (సర్ )

## రెవిన్యూ ఆదనపు కలెక్టర్ హరిసింగ్

**నూతనకల్, జూన్ 19( జనం సాక్షి)** స్పెషల్ ఎంటెన్సీ రివిజన్ (సర్ )ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా పగడ్బందీగా ఈనెల 25 నుంచి జూలై 24 వరకు చేపట్టనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణను నిర్ణయించిన లక్ష్యం మేరకు విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ హరిసింగ్ అన్నారు ఆయన గురువారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి ఆయన మాట్లాడుతూ ఓటర్ల గణన,గణ పత్రాల పంపిణీ,ధృవీకరణ విధానాలు,కాలపరిమితులు, బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ)తో సమన్వయం కలిగి ఉండాలన్నారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమానికి సకాలంలో పూర్తి చేసేందుకు సమన్వయంతో ముందుకుసాగాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు తూచా తప్పకుండా పాటించా లని సిబ్బందిని ఆదేశించారు సర్ పై వివిధ రాజకీయ పార్టీల నాయకులకు తహసిల్దార్ ఆఫీస్ లో అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరావు,మాస్టర్ ట్రైనర్ నాగయ్య, ఎంటిఎస్ఓ సందీప్,బీఎల్ఓ,తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

## - పి.ఏ.పల్లి సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి

**పి.ఏ.పల్లి, జూన్ 18(జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని స్థానిక సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నాడు మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న "వనమహోత్సవం" కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉప సర్పంచ్ కట్టెబోయిన వెంకటయ్య,కస్తూర్బా ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా,పంచాయతీ కార్యదర్శి అక్షిత,టెక్నికల్ అసిస్టెంట్ దశరథ రెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ నాగేష్,వార్డ్ మెంబర్లు పోతెం చైతన్య శంకర్,గుండెబోయిన శ్రీలత నగేష్,పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది శివ,మల్లేష్, దానమ్మ ఎల్లమ్మ,రాములమ్మ,లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడి అంటే అంత చులకనా?

**శిథిలావస్థలో చిరుమర్తి పాఠశాల ప్రాణాలు అరచేతిలో విద్యార్థులు!**

**పూర్తిగా ధ్వంసమైన మూడు గదుల పిల్లర్లు ఏ క్షణమైనా కూలే ప్రమాదం**

**గతంలో ఊడిన పైకప్పు పెచ్చులు తృటిలో తప్పిన ప్రాణనష్టం**

**మండల అధికారుల నిర్లక్ష్యంపై మాడుగులపల్లి మండలంలో తీవ్ర ఆగ్రహం**



**మాడుగులపల్లి, జూన్ 18 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతాం అంటూ పాలకులు కోటలు దాటే ప్రగతి ప్రసంగాలు ఇస్తుంటే, క్షేత్రస్థాయిలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం మాత్రం విద్యార్థుల ప్రాణాల మీదకు తెస్తోంది మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితే దీనికి సజీవ సాక్ష్యం పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి, పిల్లర్లు ధ్వంసమై ఏ క్షణంలో కూలిపోతుందో తెలియని మృత్యుకూపంగా మారినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానికంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది

**మృత్యునీడలో 1 నుండి 7వ తరగతి విద్యార్థులు**

ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చిన్నారి విద్యార్థులు చదువుకుంటున్నారు అయితే, పాఠశాల ఆవరణలోకి అడుగు పెట్టాలన్నా, క్లాస్ రూముల్లో కూర్చోవాలన్నా పిల్లలు భయంతో వణికిపోతున్నారు పాఠశాలలోని మూడు ప్రధాన గదుల పిల్లర్లు పూర్తిగా దెబ్బతిని, బేరింగ్లు ఊడిపోయి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి స్కూల్ బిల్డింగ్ కదిలితే చాలు ఎక్కడ నెత్తిన పడుతుందోనని ఉపాధ్యాయులు సైతం ఆందోళన చెందుతున్నారు ప్రభుత్వ బడులంటే అధికారులకు, పాలకులకు మరి ఇంత చులకనా? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు

**నాడు తప్పిన ప్రమాదం నేడు పట్టింపు లేని తనం!**

గతంలోనే ఓ క్లాస్ రూమ్ పైకప్పు సిమెంట్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి ఆ సమయంలో విద్యార్థులు అక్కడ లేకపోవడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పింది కానీ, లేదంటే పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు ఇంతటి ప్రమాద ఘంటికలు మోగుతున్నా, విద్యాశాఖ అధికారులు కనీసం ఇటువైపు కన్నెత్తి చూసిన



దాఖలాలు లేవు మండల స్థాయి అధికారులు ఏ రోజూ కూడా ఈ పాఠశాలను సందర్శించి, ఇక్కడి సమస్యలను పరిశీలించకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది

**ప్రమాదం జరిగాక స్పందిస్తారా? తల్లిదండ్రుల ఆగ్రహం**

ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి పిల్లల ప్రాణాలకు ముప్పు వాటిల్లిన తర్వాత అధికారులు వస్తారా? అప్పటివరకు ఏసీ గదుల్లోనే నిద్రపోతారా? అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు నిప్పులు చెరుగుతున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు, జిల్లా విద్యాశాఖాధికారి ( డి ఈ ఓ) తక్షణమే స్పందించి చిరుమర్తి పాఠశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు యుద్ధప్రాతిపదికన ధ్వంసమైన పిల్లర్లకు, గదులకు మరమ్మతులు చేపట్టాలని, విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వాలని, లేనిపక్షంలో విద్యాశాఖ కార్యాలయాల ముట్టడికి వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు.



## వరద ముంపుకు గురయ్యే ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**ప్రజల భద్రతే ప్రథమ లక్ష్యం - ముందస్తు చర్యలకు ఆదేశాలు..**

**అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి..**

**మణుగూరు, జూన్ 18 (జనం సాక్షి):** మణుగూరు మండలంలో వరద ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం విస్తృతంగా పరిశీలించారు. రాబోయే వర్షాల నేపథ్యంలో ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని సూచించారు. రావి గూడెం, సుందరయ్య నగర్ రాజీవ్ గాంధీ నగర్ పైలెట్ కాలనీలలో వాగులు, డ్రెయినేజీ వ్యవస్థలు, చెరువుల అలుగులు వంటి ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. మణుగూరు ఓసి సమీప ప్రాంతం నుండి సుందరయ్య నగర్ కు వెళ్లే వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు.

వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, వరద సహాయక చర్యలకు అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఈ పరిశీలనలో సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ,తహసిల్దార్ అద్దంకి నరేష్ , మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డి ఈ రమేష్, ఆర్ ఐ గోపి, పోలీస్, వైద్య శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ, జూన్ 18,(జనం సాక్షి):** నల్లగొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రతి వైద్యుడు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు.గురువారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వివిధ విభాగాల హెచ్‌వోడీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వైద్యుడు విధులకు సమయానికి హాజరు కావాలని, ప్రతిరోజూ ఉదయం 10 గంటలలోపు వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను నివేదిక రూపంలో తనకు పంపించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్, వివిధ విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య, అందుతున్న వైద్య సేవలు, ప్రత్యేక కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల పనితీరును సమీక్షించారు.ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలపై ఆరా తీసిన ఆయన, అవసరమైన పరికరాలను సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లకు అవసరమైన నిధులు కేటాయించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డాక్టర్ నగేష్, ప్రభుత్వ వైద్యులు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

## గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలి

**సూర్యాపేట(జనంసాక్షి):** భారత ప్రభుత్వం, తెలంగాణ పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు ఎల్‌పీజీ వినియోగారులు తమ ఈకేవైసీ ప్రక్రియను ఈ నెల 30లోపు తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని జిల్లా కేంద్రంలోని గోపయ్య చారి ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకురాలు పోలోజు శారద గురువారం ఒక ప్రకటనలో కోరారు.గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండి ఇప్పటి వరకు ఈకేవైసీ పూర్తి చేయని వినియోగదారులు వెంటనే పూర్తి చేసుకోవాలని అన్నారు.ఈకేవైసీ పూర్తి చేయని వినియోగాదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, సబ్సిడీ సౌకర్యాల అంతరాయం కలిగే అవకాశం ఉందని తెలిపారు.వినియోగదారులు తమ ఆధార్ కార్డు, నమోదైన మొబైల్ నెంబర్‌తో ఏజెన్సీ కార్యాలయానికి వచ్చి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు.

## జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను రూపాంతరం చేయాలి

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయి విద్యా కేంద్రాలుగా మార్చడమే లక్ష్యంగా భవిష్యత్ తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను సమగ్ర రూపాంతరం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు.గురువారం విద్యా శాఖ అధికారులతో వెబ్ ఎక్స్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలం నుండి ఒక ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసి, వాటిని దశలవారీగా మోడల్ స్కూల్స్ గా అభివృద్ధి చేయాలని తెలిపారు.ఇందులో భాగంగా పాఠశాలల ప్రస్తుత పరిస్థితి, అవసరాలను బట్టి వాటిని కేటగిరీలుగా విభజించాలన్నారు.తొలి దశలో ఎంపిక చేసిన పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య, భవిష్యత్ నైపుణ్యాలు, సమాజ భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. మరుగుదొడ్లు, సురక్షితమైన తాగునీరు, నిరంతర విద్యుత్ సదుపాయం, తరగతి గదుల మరమ్మతులు, ఫర్నిచర్, అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రెరీలు, క్రీడా మైదానాల అభివృద్ధి, పాఠశాల ఆవరణ సుందరీకరణ చేపట్టాలని వెల్లడించారు ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, కోడింగ్, డిజిటల్ లిటరసీ, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్, కెరీర్ గైడెన్స్ కోచింగ్ లను మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా మార్చేందుకు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు.పాఠశాలల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యతగానే కాకుండా, ఒక ప్రజా ఉద్యమంగా సాగాలన్నారు.ఇందుకోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, తల్లిదండ్రుల కమిటీలు, పూర్వ విద్యార్థుల సంఘాలు, దాతలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శిరీష, డీఈఓ అశోక్, కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, డిప్యూటీ రమేష్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## వనమహోత్సవానికి శ్రీకారం.. జిల్లాలో 57.70 లక్షల మొక్కల లక్ష్యం

### కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి,జూన్ 18,(జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లాలో 57 లక్షల 70 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు నుంచి వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభమైందని పేర్కొన్న కలెక్టర్, ప్రతి ఇంటి వద్ద కనీసం ఆరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పార్కులు, రహదారుల వెంట, ఖాళీ స్థలాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్లలో మొక్కల పెంపకానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అన్నారు.లతీఫ్‌సాబ్ గుట్టపై ఎలాంటి మొక్కలు నాటాలనే అంశంపై అటవీ శాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోందని తెలిపారు. ఈ సంవత్సరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో 1.65 లక్షల మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ సమతుల్యత కోసం కోట్లాది మొక్కలు అవసరమని అన్నారు. పెరుగుతున్న నిర్మాణాల కారణంగా పచ్చదనం తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నీరు, ఆహారం కలుషితం కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. గుట్టలపై కూడా విస్తృతంగా మొక్కలు నాటాలని, పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, డీఎఫ్ఓ రాజశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర, డీఐఈఓ దశ్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

